



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 174 | ది.11-10-2026 | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 174 | Date : 11-10-2026 | Sunday | Pages : 8 | Rs.1/- |




దర్శించండి - తరించండి

స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747

# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 174 | ది.11-10-2026 | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 174 | Date : 11-10-2026 | Sunday | Pages : 8 | Rs.1/- |

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక.. ఆడబిడ్డల ఆత్మీయ వేడుక.. బతుకమ్మ పండుగ! - ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 10 (వార్తాప్రభ) :** తెలంగాణ ఆడబిడ్డల అతిపెద్ద పండుగ, సింగిడి రంగుల పూల సంబరం బతుకమ్మ పండుగ ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమవుతున్న శుభ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మహిళలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ, ప్రకృతి అందాలను పూలలో కొలువుదీర్చే ఈ పూల పండుగ ప్రతి ఇంటా ఆనందాలను, ప్రతి గుండెలో సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. గౌరమ్మ తల్లి ఆశీస్సులతో ఆడబిడ్డలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ముఖ్యమంత్రి మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

### స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు.

# ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం

- రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సులకు కేబినెట్ ఆమోదం
- పలు పదవులకు 24 శాతం నుంచి 35 శాతం వరకు రిజర్వేషన్లు
- కూటమి పక్షాల ద్వారా 34 శాతం సీట్లు బీసీలకు కేటాయిస్తామని హామీ



**అమరావతి,అక్టోబర్ 10 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లపై చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చంద్రబాబు అధ్యక్షతన ఈరోజు జరిగిన కేబినెట్ సమావేశంలో... రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ చేసిన సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ ఆమోదించిన వివరాల ప్రకారం... స్థానిక సంస్థల్లో వివిధ పదవులకు కొత్త బీసీ రిజర్వేషన్ల శాతాలను ఖరారు చేశారు. ఇందులో మేయర్లకు 35.29 శాతం, మున్సిపల్ ఛైర్‌పర్సన్లకు 33.02 శాతం, పట్టణ వార్డు సభ్యులకు 32.78 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. అలాగే, సర్పంచ్‌లకు 27.95 శాతం, ఎంపీటీసీలకు 25.55 శాతం, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు 24.60 శాతం చొప్పున కోటా కేటాయించారు. జెడ్పీ ఛైర్‌పర్సన్లకు మాత్రం 23.08 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను సుప్రీంకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. కోర్టు తీర్పును గౌరవిస్తూ, నిబంధనలకు అనుగుణంగా బీసీలకు లబ్ధి చేకూర్చేలా ఈ రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు మంత్రులు తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్ల కన్నా ఇవి మెరుగ్గా ఉన్నాయని వారు పేర్కొన్నారు. చట్టపరంగా రిజర్వేషన్లు అందిస్తూనే, కూటమి పక్షాల మధ్య సీట్ల పంపకాల ద్వారా మొత్తం మీద 34 శాతం ప్రయోజనం బీసీలకు దక్కేలా చూస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# ఢిల్లీలో హై టెన్షన్..

## మమతా, కేజ్రీవాల్ సహా పలువురు మాజీ సీఎంల అరెస్ట్

- ఢిల్లీలో నిరసనల ఉద్రిక్తత.. మమతా, కేజ్రీవాల్ అరెస్ట్
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ విపక్షాల డిమాండ్
- అనుమతి లేదంటూ నేతలను అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- కేరళ మాజీ సీఎం పినరయి విజయన్‌తో పాటు పలువురు ఎంపీల నిర్బంధం



**న్యూ ఢిల్లీ,అక్టోబర్ 10 (వార్తాప్రభ) :** రాజధాని ఢిల్లీలో నేడు తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల్లో పాల్గొన్న పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ సహా పలువురు విపక్ష నేతలను కూడా నిర్బంధించి డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. ఎన్నికల కమిషన్, ఎన్నికల ప్రక్రియలకు సంబంధించిన ఆరోపణలపై విపక్షాలు తలపెట్టిన ఆందోళనల్లో పాల్గొనేందుకు మమతా బెనర్జీ ఢిల్లీకి వచ్చారు. సెంట్రల్ ఢిల్లీలోని సౌత్ అవెన్యూ సమీపంలో పోలీసులు ఆమెను అడ్డుకోవడంతో, సమీపంలోని బస్టాండ్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు ఆమెను, టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓబ్రెయిన్, డోలా సేన్‌లను అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు ఇదే నిరసనలో పాల్గొనేందుకు తన నివాసం నుంచి బయటకు వస్తున్న అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు మార్గమధ్యంలోనే నిర్బంధించారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ వంటి ఇతర నేతలను కూడా అరెస్ట్ చేశారు. జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఈ నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ఢిల్లీ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీకి చేరుకున్న సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కేను కూడా పోలీసులు నిర్బంధించారు. నగరంలో నిరసనలకు ఆంక్షలు అమలులో ఉన్నాయని, ఆందోళనకు ముందస్తు అనుమతి లేనందునే నేతలను అదుపులోకి తీసుకున్నట్టు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణలతో పాటు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై విపక్షాలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎన్నికల కమిషన్ జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టాయి. ఈ అరెస్టుల నేపథ్యంలో భవిష్యత్తులో తమ ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని విపక్ష నేతలు సూచిస్తున్నారు.

# 13న విజయవాడకు రానున్న తమిళనాడు సీఎం విజయ్..

## సీఎం చంద్రబాబుతో కృష్ణా జలాల వాటాపై కీలక చర్చలు

- తెలుగు గంగ ఒప్పందం ప్రకారం నీరు రావడం లేదని తమిళనాడు ఆందోళన
- ఏపీ నిర్మించతలపెట్టిన డ్యామ్‌లపైనా చర్చించనున్న సీఎం విజయ్
- పర్యటనలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోనూ భేటీ అయ్యే అవకాశం



**విజయవాడ,అక్టోబర్ 10 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాల పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడనుంది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఈ నెల 13న విజయవాడలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. ప్రధానంగా తెలుగు గంగ ప్రాజెక్టు కింద కృష్ణా జలాల సరఫరాలో ఏర్పడిన లోటు, ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన డ్యామ్‌లు, నదుల అనుసంధానం వంటి అంశాలు ఈ భేటీలో ప్రస్తావనకు రానున్నాయి. తెలుగు గంగ ఒప్పందం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ ఏటా 12 టీఎంసీల కృష్ణా జలాలను తమిళనాడుకు రాష్ట్ర సరిహద్దు వద్ద అందించాల్సి ఉంది. అయితే, ఈ ఏడాది అక్టోబర్ 9 నాటికి కేవలం 2.251 టీఎంసీల నీరు మాత్రమే అందింది. ఒప్పందం ప్రకారం రావాల్సిన నీటికి, ఇప్పటివరకు అందిన నీటికి మధ్య 9.749 టీఎంసీల భారీ వ్యత్యాసం ఉంది. ఈ నీటి కొరత అంశమే ఇద్దరు ముఖ్యమంత్రుల భేటీలో ప్రధాన చర్చనీయాంశంగా మారనుంది. ఈ ఏడాదిలో మిగిలిన కాలానికి తమిళనాడు నీటి అవసరాలను సమీక్షించి, సరఫరాను గాడిన పెట్టేందుకు ఈ సమావేశం ఒక అవకాశంగా నిలవనుంది. కృష్ణా జలాల వాటాతో పాటు తమిళనాడులోకి ప్రవహించే నదులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డ్యామ్‌లు నిర్మించేందుకు చేస్తున్న కసరత్తుపై కూడా సీఎం విజయ్ తన ఆందోళనలను చంద్రబాబు దృష్టికి తీసుకురానున్నారు. ఈ డ్యామ్‌ల నిర్మాణం వల్ల దిగువ రాష్ట్రమైన తమకు నీటి లభ్యతపై తీవ్ర ప్రభావం పడుతుందని తమిళనాడు భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతిపాదిత డ్యామ్‌ల అంశం కూడా చర్చల ఎజెండాలో కీలకంగా ఉండనుంది. దీంతో పాటు నదుల అనుసం ధానంపై కూడా ఇరు రాష్ట్రాల మధ్య సంప్రదింపులు జరిగే అవకాశం ఉంది. ఈ పర్యటనలో భాగంగా సీఎం విజయ్, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు ఇతర మంత్రులతో కూడా సమావేశం కానున్నారని సమాచారం. ఇరు రాష్ట్రాల రాజకీయ నాయకత్వాల మధ్య ప్రత్యక్ష చర్చల ద్వారా దీర్ఘకాలంగా ఉన్న నీటి సమస్యలకు ఒక పరిష్కారం కనుగొనాలని తమిళనాడు ప్రభుత్వం భావిస్తోంది.

Before the Motor Accident Claims Tribunal cum VIIIth Addl District & Sessions Judge at Vijayawada
MVOP: 33/2026
Between :
Prajapathi Rajakee Devi and other --------Petitioners
And
1) లాబా దళపతి మరియు ఇతరులు -------Respondents
R1 లాబా దళపతి S/o సమర దళపతి, వ్యాను డ్రైవరు, R/o 67-1-36/12A, NSM స్కూలు దగ్గర, దర్మిపేట పటమట, విజయవాడ
పై నెంబరు గల పిటీషను 1వ పిటీషనరు యొక్క భర్త గారు రోడ్డు ప్రమాదంలో తగిలిన గాయముల వలన మరణించగా సదరు మరణానికి నష్టపరిహారం కోరుతూ పై పిటీషను దాఖలు చేయగా, సదరు 1వ రెస్పాండెంటు అయిన మీ యొక్క హాజరు నిమిత్తం ది.06-11-2026 ఉ॥10.30ని॥ హాజరై యొక్క ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల పరోక్షంగా తీర్మానించబడును.
(శ్రీ కోర్టు ఉత్తర్వుల ప్రకారం)
I.మురళీ కృష్ణధర్, MA., LLM
న్యాయవాది, విజయవాడ
సెల్ : 9246474096

వేలం ప్రకటన
మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E. P. No. 22 / 2025
in
O.S.No.492 / 2024
Between :
మట్టా తుకారం -------D. Hr
మరియు
1) బాడుగు పవన్ వీర వెంకట సరోవర్
2) బాడుగు అన్వేష్ కుమార్ -------J. Drs
పై నెంబరు డిక్రీ బాకీని రాబట్టుకునే నిమిత్తం యీ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారి యెదుట ది. 02.11.2026న ఉదయం గం. 10.30ని॥ల నుండి వేలం వేయబడును. కావున పాడు కొనదలచిన వారు సదరు వేలం పాటలో పాల్గొని వేలం షరతులకు లోబడి పాట పాడుకొనవచ్చును. అని ఇందుమూలముగా యావన్మందికీ తెలియచేయడమైనది.
షెడ్యూలు :
కృష్ణా జిల్లా, మచిలీపట్నం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా మచిలీపట్నం, ఈడేపల్లి లో J.Drs యొక్క సంపూర్ణ స్వాధీనహక్కు భుక్తంలో కలిగియుండి పై నెంబరు దావా బాకీకి హామీగా జప్తుకాబడి యీ నెంబరు వారంటు బాకీ క్రింద వేలం కావలసిన స్థిరాస్తి వివరములు. చ.గ.111ల స్థలము సదరు స్థలములో పాత డోరు నెం. 14/15ఎ, ప్రస్తుత డోరు నెం. 14/15రున నిర్మించబడిన ఆస్బెస్టాస్ షీట్ ఇంటికి హద్దులు : **తూర్పు** : తాతా శివ ప్రసాద్ గారి ఇల్లు , **దక్షిణం** : రేకపల్లి ప్రజల నడక దారి , **పడమర** : కాపుసంఘం వారి చౌల్ట్రీ (సత్రం) స్థలం, **ఉత్తరం** : J. Drs మరియు G.శేషగిరిరావు ల ఆస్తి కి నడక దారి.
D.Hr కిమ్మత్తు : రూ.11,00,000/- లు
అమీనా కిమ్మత్తు : రూ . 25,00,000/-లు
NOTE:- E.C. దాఖలా అన్యాక్రాంతములు ఏమియున్నా లేవు.
(శ్రీ కోర్టు వారిఉత్తర్వుల ప్రకారం)
పేర్ని సురేషబాబు
D. Hr తరుపున న్యాయవాది, మచిలీపట్నం.
సెల్ : 93464 22969

SUIT SUMMONS
IN THE COURT OF II ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) : VIJAYAWADA
O.S. 1317 / 2022
BETWEEN :
State Bank of India, RACPC-II Vijayawada rep by its Chief manager --------Plaintiff
And
Kasukurthi Mahesh Babu son of Raja 61-19-1/1, Alla Challarao Street, Ramalingeswara Nagar, Ambika Nilayam, Vijayawada-13 --------Defendant
Defendant take suit summons in the above suit filed against you by the Plaintiff for the recovery of loan amount of Rs. 1,78,564/- under loan account No. 37897378908 and the suit stands posted to 16-10-2026 for your appearance, at 10.30 A.M., before this Hon'ble Court on that day. Else next step follows.
// By Order //
T.V.N.VASUDEVA RAO
Advocate for Plaintiff

మహారాజశ్రీ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు విజయవాడ
OS.NO. 55/2026
Between:
Bank of Baroda, NTR Colony Branch, Vijayawada
Rep by its Chief Manager .. Plaintiff
AND
M/s Lakshmi Siri Enterprises and others ..... Defendant
To.
1. M/s. Lakshmi Siri Enterprises, Vijayawada
Rep. By its Managing Partners (1) Mekala Sashank Reddy (2) Mekala Ramya Reddy, Vijayawada.
2. Mekala Sashank Reddy, S/o. Vijaya Sagar Reddy, Managing Partner M/s. Lakshmi Siri Enterprises, Vijayawada.
3. Mekala Ramya Reddy, D/o. Vijaya Sagar Reddy, Managing Partner M/s. Lakshmi Siri Enterprises, Vijayawada
పై నెంబరు గల దావాలో మీరు ప్రతివాదులు 1 నుండి 3 అయిన మీకు నోటీసు నిమిత్తం **ది.27-11-2026 వ** తేదిన పై కోర్టు వారు వాయిదా వేసినారు కావున సదరు తేదిన మీరు గాని మీ తరపున ప్లీడరు గారు గాని పైన తెలిపిన కోర్టు వారి ముందు **ది.27-11-2026 వ తేది ఉదయం 10.30 ని.లకు** పై కోర్టులో హాజరై తగిన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున పై నెంబరు దావాలో విచారించగలరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(By Order of the Hon'ble Court)
ఇట్లు
యం.డి ప్రభాకర్, M.Com, LL.M., న్యాయవాది,
డి.నెం.31-16-30, బుల్లెమ్మ వీధి, మాచవరం,
విజయవాడ-520004. ఫోన్: 9290055959
email: advdurgaprabhakar@gmail.com

# ఏపీలో 271 మద్యం దుకాణాలకు రెండో విడత నోటిఫికేషన్

- ఈ నెల 19వ తేదీ అర్ధరాత్రి వరకు దరఖాస్తులు.. 21న ఉదయం 8 గంటలకు లాటరీ



**అమరావతి, అక్టోబర్ 10 (వార్తాప్రభ):** ఆంధ్రప్రదేశ్‌లో 2026--27 మద్యం దుకాణాల విధానంలో భాగంగా తొలి విడతలో కేటాయింపు కాని 271 ఏ4 మద్యం దుకాణాలకు ప్రభుత్వం రెండో విడతలో నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఈ దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించనున్నారు. తొలి విడతలో మిగిలిపోయిన దుకాణాలకు కేటాయింపులు పూర్తి చేసేందుకు ఈ చర్య తీసుకున్నట్లు నిషేధ, ఎక్సైజ్ శాఖ కమిషనర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,736 ఏ4 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ ఇవ్వగా, 2,929 దుకాణాలు పునరుద్ధరణ ద్వారా, 517 దుకాణాలు తొలి విడత లాటరీ ద్వారా కేటాయించినట్లు వివరించారు. మరో 19 దుకాణాలకు గడువు పొడిగింపు ద్వారా కేటాయింపులు జరిగాయని తెలిపారు. మొత్తంగా 3,465 దుకాణాల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందని, ఇది మొత్తం దుకాణాల్లో సుమారు 93 శాతమని పేర్కొన్నారు. రెండో విడత నోటిఫికేషన్‌లో 267 సాధారణ కేటగిరీ దుకాణాలు, నాలుగు రిజర్వుడు కేటగిరీ దుకాణాలు ఉన్నాయి. అర్హత కలిగిన ఆసక్తిగల వారు నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో దుకాణానికి తిరిగి చెల్లించని దరఖాస్తు రుసుము రూ. 3 లక్షలుగా నిర్ణయించారు. దరఖాస్తులను అక్టోబర్ 19వ తేదీ అర్ధరాత్రి వరకు స్వీకరిస్తారు. అక్టోబర్ 21వ తేదీ ఉదయం 8 గంటలకు సంబంధిత జిల్లా కలెక్టర్ల కార్యాలయాల్లో లాటరీ నిర్వహిస్తారు. ఎంపికైన దరఖాస్తుదారులకు అదే రోజు సమాచారం అందిస్తారు. కేటాయింపుల ప్రక్రియను ఎక్సైజ్ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. అర్హులైన వారు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాల వారీగా వైఎస్సార్ కడపలో అత్యధికంగా 33 దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఎస్పీఎస్ నెల్లూరులో 24, గుంటూరు, తిరుపతి జిల్లాల్లో 19 చొప్పున, పశ్చిమ గోదావరిలో 17, ప్రకాశంలో 16, అనంతపురంలో 15 దుకాణాలు ఉన్నాయి. అనకాపల్లి, కృష్ణా జిల్లాల్లో 13 చొప్పున, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 12 చొప్పున, మార్కాపురంలో 11, శ్రీకాకుళంలో 10 దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. కాకినాడ, నంద్యాల జిల్లాల్లో ఎనిమిది చొప్పున, శ్రీ సత్యసాయి జిల్లాలో ఏడు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమలో ఆరు, ఏలూరు, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో ఐదు చొప్పున దుకాణాలు ఉన్నాయి. అన్నమయ్యలో నాలుగు, చిత్తూరులో మూడు, అల్లూరి సీతారామరాజు, కర్నూలు, ఎన్టీఆర్ జిల్లాల్లో రెండు చొప్పున దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. తూర్పు గోదావరి, పోలవరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో రెండో విడతలో నోటిఫికేషన్ ఆవశ్యకత లేదు.

# టిడ్కో ఇళ్ల పేరుతో ఎన్నాళ్లీ రాజకీయ హామీలు?

- ఓట్లు అడిగే ముందు లబ్ధిదారులకు ఇండ్లను నివాసయోగ్యంగా అందించాలి!
- లబ్ధిదారుల సమస్యలపై సీపీఐ గళం.. అభ్యర్థులను గెలిపించండి --- పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు విజ్ఞప్తి



**జగ్గయ్యపేట,అక్టోబర్ 10 (వార్తాప్రభ) :** పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాల్సిన టిడ్కో ఇళ్లు రాజకీయ పార్టీలకు ఎన్నికల హామీల అంశంగా మారుతున్నాయా? ఎన్నికల సమయంలో ఇళ్ల పేరుతో ఆశలు కల్పించడం, అధికారంలోకి వచ్చిన తర్వాత లబ్ధిదారుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించకపోవడం ఎంతవరకు సమంజసం? జగ్గయ్యపేట పట్టణంలోని టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు ఇప్పుడు ఈ ప్రశ్నలను తెరపైకి తెస్తున్నాయి. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలోనూ టిడ్కో ఇళ్ల పంపిణీపై హామీలు, ప్రకటనలు వెలువడ్డాయని, లబ్ధిదారుల్లో ఆశలు పెరిగాయని సీపీఐ జగ్గయ్యపేట పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు విమర్శించారు. అయితే, ఇళ్లు పూర్తిస్థాయిలో నివాసయోగ్యంగా మారి లబ్ధిదారులకు అందుబాటులోకి రాకపోవడంతో అనేక కుటుంబాలు నిరీక్షణలోనే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ నేతలు, కూటమి ప్రభుత్వ భాగస్వామ్య పక్షాల నాయకులు కూడా టిడ్కో ఇళ్లను అందిస్తామంటూ ముందుకు వస్తున్న నేపథ్యంలో, గతంలో ఇచ్చిన హామీల అమలు ఎంతవరకు జరిగిందో ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

**ఎన్నికల హామీలు కాదు.. చేతికి అందే ఇళ్లు కావాలి!** ఒక పేద కుటుంబానికి సొంత ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదు. అద్దె భారంలేని జీవితం, కుటుంబానికి భద్రత, పిల్లలకు స్థిరమైన భవిష్యత్తు. అలాంటి కీలకమైన అంశాన్ని రాజకీయ ప్రచారానికి మాత్రమే పరిమితం చేయడం వల్ల నష్టపోయేది సామాన్య ప్రజలేనన్నది లబ్ధిదారుల ఆవేదన. ఇల్లు మంజూరైనట్లు పత్రాలు ఉండటం, నిర్మాణం పూర్తయినట్లు ప్రకటించడం మాత్రమే సరిపోదు. తాగునీరు, విద్యుత్, మురుగునీటి పారుదల, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలతోపాటు గృహం వాస్తవంగా నివసించడానికి అనువుగా ఉండాలి. అప్పుడే లబ్ధిదారులకు ఇంటి కేటాయింపు వల్ల ప్రయోజనం చేకూరుతుంది. అందుకే టిడ్కో ఇళ్ల విషయంలో ప్రకటనలకు బదులుగా క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి, పెండింగ్ పనులు పూర్తి చేసి, అర్హులైన వారికి ఇళ్లను అప్పగించాలని డిమాండ్ వినిపిస్తోంది.

**ఓటు అడిగే నాయకులను నిలదీయాలి.. హామీలకు లెక్క అడగాలి!** ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు ఇచ్చే హామీలను గుడ్డిగా నమ్మి ఓటు వేయకుండా, తమ సమస్యల పరిష్కారానికి ఎవరు నిజంగా కృషి చేస్తారో ప్రజలు ఆలోచించాలని జూనెబోయిన శ్రీనివాసరావు కోరారు. గతంలో అధికారంలో ఉన్నవారు ఏమి చేశారు? ప్రస్తుతం అధికారంలో ఉన్నవారు ఏమి చేయబోతున్నారు? టిడ్కో ఇళ్లను ఎప్పటిలోగా నివాసయోగ్యంగా అందిస్తారు? మౌలిక సదుపాయాల కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అనే ప్రశ్నలకు నాయకులు స్పష్టమైన సమాధానాలు చెప్పాలని ఆయన పేర్కొన్నారు. ఓటు అనేది ఐదేళ్లకోసారి వేసే గుర్తు మాత్రమే కాదు; ప్రజాప్రతినిధుల పనితీరును నిర్ణయించే ప్రజాస్వామ్య శక్తి. ఆ శక్తిని తాత్కాలిక హామీలకు పరిమితం చేయకుండా, తమకు రావాల్సిన హక్కులను సాధించుకునేందుకు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

**సీపీఐ అభ్యర్థులకు మద్దతివ్వండి.. లబ్ధిదారుల ఐక్యతను చాటండి..** జగ్గయ్యపేట మున్సిపాలిటీలో ప్రజా సమస్యలపై గట్టిగా మాట్లాడే సీపీఐ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని జూనెబోయిన శ్రీనివాసరావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు తమ సమస్యను వ్యక్తిగత సమస్యగా కాకుండా, హక్కుల సాధనకు సంబంధించిన ఉమ్మడి సమస్యగా గుర్తించాలని కోరారు. సీపీఐ అభ్యర్థులకు బలమైన ప్రజా మద్దతు లభిస్తే మున్సిపాలిటీలో టిడ్కో ఇళ్ల సమస్యతోపాటు తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, ఇతర పట్టణ సమస్యలపై ప్రజల తరఫున గట్టిగా ప్రశ్నించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారులంతా ఐక్యంగా నిలబడి తమకు న్యాయం జరిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**ప్రజల ముందున్న అసలు ప్రశ్న ఇదే!** టిడ్కో ఇళ్ల విషయంలో ఏ పార్టీ హామీ ఇచ్చినా, ఆ హామీ అమలుకు గడువు ఏమిటి? ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి? ఎన్ని ఇళ్లు నివాసయోగ్యంగా ఉన్నాయి? ఇంకా ఎన్ని కుటుంబాలు ఇళ్లకోసం ఎదురుచూస్తున్నాయి? అనే వివరాలను అధికార యంత్రాంగం ప్రజల ముందుంచాలి. అలాగే, లబ్ధిదారులకు ఇళ్లు అందించడంలో ఉన్న అడ్డంకులను తొలగించేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి. ఇల్లు ప్రజల హక్కు.. హామీ రాజకీయ నాయకుల బాధ్యత! టిడ్కో ఇళ్ల పేరుతో ఓట్లు కోరే నాయకులు ముందుగా లబ్ధిదారుల సమస్యలకు పరిష్కారం చూపాలి. ఎన్నికల ప్రచారంలో ఇచ్చే మాటలు ఆచరణలోకి వచ్చినప్పుడే ప్రజలకు రాజకీయాలపై నమ్మకం పెరుగుతుంది. జగ్గయ్యపేట మున్సిపాలిటీలో టిడ్కో ఇళ్ల సమస్య పరిష్కారం దిశగా ఏ పార్టీ ఎంత చిత్తశుద్ధితో పనిచేస్తుందో ప్రజలు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలన్నది సీపీఐ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు విజ్ఞప్తి సారాంశం.

# సంపాదకీయం

## ఢిల్లీలో పై 'చేయి' ఎవరిది ?!

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నిరుద్యోగ యువతను కాక్రోచెస్ పోల్చడంతో వ్యంగ్యంగా మొదలైన కాక్రోచ్ జనతాపార్టీ నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కోరుతూ జంతర్ మంతర్ లో చేసిన ఆందోళనలతో బలపడింది. సీజేపీ ఆందోళనలు మొదట తేలిగ్గా తీసుకున్న కేంద్రం చివరకు ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించాల్సి వచ్చింది. సర్ ప్రక్రియలో భాగంగా దేశంలో సుమారు 13 కోట్ల ఓట్లు తొలగించిన నేపథ్యంలో ఎన్నికల కమీషన్ లో ఉన్న ఇద్దరు కమీషనర్లు సుఖ్ బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు 14 సార్లు సర్ కు ప్రక్రియ కొనసాగుతున్న వివాదం మీద అభ్యంతరాలు నమోదు చేసినట్లు వార్తలు బయటకు వచ్చాయి. దీంతో అర్హులైన ఓటర్లను ఓటు హక్కు నుంచి దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఓటు డాటా బేస్ నిర్ణయాల్లో పారదర్శకత లేకపోవడాన్ని ప్రతిపక్షాలు, సీజేపీ దీనిని ఓటు చోరీగా పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే సీజేపీ 'జంతర్ మంతర్ 2.0' పేరుతో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద నిరసనలకు పిలుపునిచ్చింది. సీజేపీ ఆందోళనలకు పోలీసులు అనుమతులు నిరాకరించారు. 25 వేల పారామిలటరీ బలగాలను మోహరించారు. రైళ్లను రద్దు చేశారు. 45 మెట్రో స్టేషన్లలో ఆంక్షలు విధించారు. ట్రాఫిక్ పెద్ద ఎత్తున మళ్లించారు. దీంతో ఢిల్లీలో ట్రాఫిక్ జామ్ కొనసాగుతోంది. రాజకీయం మారుతున్న సంకేతమా? ఈ నేపథ్యంలో ఆందోళన చేసేందుకు ఢిల్లీకి వచ్చిన సీజేపీ అధినేత అభిజిత్ దీప్కే, నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను ముంబై నుంచి ఢిల్లీకి వచ్చిన ఎయిర్ ఇండియా ఫ్లైట్ లో ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లో అరెస్ట్ చేశారు. ప్రముఖ యూట్యూబర్ ధృవ్ రాఠీని గురుగ్రామ్ లో, సీజేపీ లీగల్ టీమ్ హెడ్ రత్నసింగ్ ను వారి నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. రైళ్లు రద్దు చేస్తూ ఆందోళనలు అదుపులోకి తేవాలని చేసిన ప్రభుత్వ చర్యలపై 'ఈగను చంపడానికి సుత్తిని ఉపయోగిస్తారా' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. విషాదంలో సీజేపీ బాస్ ప్రస్తుతం ఢిల్లీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ చర్యలను సీజేపీ నియంతృత్వం, యువతను ప్రభుత్వం భయపెడుతోందని, మోడీ ఓటమి అంగీకరించాడని చెబుతుంది. ఢిల్లీని కంటోన్మెంట్ గా మార్చారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. గతంలో జరిగిన ఆందోళనలు మొదట తేలిగ్గా తీసుకున్న ప్రభుత్వం తర్వాత అణచివేతకు కఠినంగా వ్యవహరించింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి. చివరకు కేంద్ర మంత్రి రాజీనామా చేయక తప్పలేదు. ప్రస్తుత ప్రభుత్వ చర్యలు నివారణాత్మకమేనా ? లేక అణచివేతనా ? అరెస్టు అయినవారు, అదుపులోకి తీసుకున్న వారు ఎప్పుడు విడుదల అవుతారు ? నిరసన ఎలా ముందుకు సాగుతుంది అన్న ఉత్కంఠ నెలకొంది. ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనలో ఎవరిది పైచేయి అవుతుందో తెలియాలంటే వేచిచూడాల్సిందే.

## జయప్రద ఫౌండేషన్ వారి జాబ్ మేళా లో పాల్గొన్న చైర్మన్ శ్రీ తొండపు దశరథ జనార్ధన్





**పెనుగంచిప్రోలు - అక్టోబర్ 10( వార్త ప్రభ )**అన్న నందమూరి తారకరామారావు స్ఫూర్తితో నేడు నారా చంద్రబాబు నాయుడు పి4 కార్యక్రమాన్ని జగ్గయ్యపేట నియోజకవర్గంలో అమలు చేస్తూ జయప్రద ఫౌండేషన్ ద్వారా గత ఎనిమిది సంవత్సరాలుగా వత్సవాయి మండలం లింగాల గంగవల్లి పోచవరం గ్రామాలలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేస్తూ దత్త గ్రామాలతో పాటుగా నియోజకవర్గంలో కూడా ప్రజలకు ఉపయోగపడే విధముగా మా కుటుంబం ఆలోచించి పేద ప్రజల కోసం విద్య, వైద్య, ఉపాధి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగు పడవచ్చు నన్న ఉద్దేశంతో నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో ఫౌండేషన్ ద్వారా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, మెరుగైన వైద్య సేవలతొ కార్పోరేట్ స్థాయి వైద్యాన్ని గ్రామస్థాయిలో ఉన్న నిరుపేదలకు అందిస్తూ, మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ అవతరించాలనే ఉద్దేశాన్ని అమలు పరుస్తూ ఉన్న సందర్భంలో వైద్య సదుపాయాలతో పాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పించాలని గ్రామాలలో ఉన్న పెద్దలు వారి కుమారుల జాబులు కొరకు ఎంతోమంది నా వద్దకు వస్తున్నారని ఆలోచిస్తూ నిరుద్యోగ యువతకు మంచి అవకాశాలు కల్పించాలననే ఆలోచనతో నేడు మన ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షిస్తూ అనంతరం లక్షల మంది యువతకు ఉద్యోగాల కల్పనకు ఆలోచిస్తున్న సందర్భముగా మన నియోజకవర్గంలో కూడా ఉద్యోగాలు పొందుటకు మంచి నైపుణ్యం తో మెరుగైన అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో ప్రతి నెల పేరున్న కంపెనీలను తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు మౌఖిక పరీక్షలు నిర్వహించి వారి స్కిల్స్ ను డెవలప్మెంట్ చేసుకునే విధంగా ట్రైనింగులు ఇప్పించి తద్వారా కంపెనీల వారీగా జాబ్ మేళాలను నిర్వహించి మంచి ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, రాబోవు సంవత్సరాలలో ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో పని చేయటం జరుగుతుందని తెలియజేసినారు. ఈనెల 21వ తేదీన వత్సవాయి మండలం వత్సవాయి లో కూడా అమర్ రాజా కంపెనీ వారితో టెన్త్ ఇంటర్ ఐటిఐ చదివిన విద్యార్థులకు మరొకసారి అక్కడ జాబ్ మేళా నిర్వహిస్తామని ఈరోజు రానివారు 21వ తేదీన జాబ్ మేళాలో పాల్గొనవలసినదిగా తెలియజేసినారు. ఈనెల 15వ తేదీన నందిగామ మండలం జొన్నలగడ్డ పరిధిలో గట్టు మూల వేమూరి కన్వెన్షన్ లో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామని ఈ ప్రాంత ప్రజలు సదరు వైద్య సదుపాయాలను ఉపయోగించుకొని మీ ఆరోగ్యాలను మెరుగుపరు చుకోవాలని తెలియజేసినారు. ఈనాటి జాబ్ మేళా కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గం లోని 43 గ్రామాల నుండి 135 మంది యువత హాజరవుగా, 90 మందికి ఆఫర్ లెటర్లు ఇవ్వడం జరిగినది. మా ఫౌండేషన్ ద్వారా అమర్ రాజా కంపెనీ వారు ఇచ్చిన ఈ అవకాశాన్ని యువత ఉపయోగించుకోవాలని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, ఫౌండేషన్ మెంటార్ చెరుకూరి చాముండేశ్వరి ఫౌండేషన్ ప్రతినిధులు అమర్ , ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ సభ్యులు రఘు , మాజీ ఎంపిపి వేగినటి గోపాలకృష్ణమూర్తి , దేవస్థానం చైర్మన్ చుంచు రమేష్, మాజీ జెడ్ పిటిసి గజ్జీ కృష్ణమూర్తి,నలుమోలు శివ రామ ప్రసాద్, జిల్లేపల్లి సుధీర్, కాకాని శ్రీనివాసరావు, కాకాని బ్రహ్మం, పొన్నం బాలాజీ, సొసైటీ అధ్యక్షులు వేమూరి వెంకటేశ్వరరావు, అత్తులూరి అచ్యుతరావు, చింతా రవి కుమార్, కర్ల వెంకటనారాయణ, కన్నె టి పద్మజ, కొత్తపల్లి సతీష్ లగడపాటి ప్రవీణ్, మాదినేని వెంకట్రావు, కొలిపాక బ్రహ్మం, ముళ్లపాటి ప్రభాకర్ రావు, కర్లకోటేశ్వరి, కర్ల నాగేశ్వరరావు, బీజేపీ నేత కల్లూరి శ్రీవాణి, మరియువివిధ హోదాల్లో ఉన్న నాయకులు, అమర్ రాజా కంపెనీ ప్రతినిధులు కార్తీక్, మనోజ్ కుమార్ ఫౌండేషన్ వాలంటీర్లు వివిధ గ్రామాల నుండి వచ్చిన నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సేవలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

# సరస్ మేళాలో వాడుక నీరు ప్రవహించేందుకు ప్రత్యేక డ్రైనేజ్ వ్యవస్థ

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 10 :(వార్త ప్రభ ప్రతినిధి)** అక్టోబర్ 13, 2026 నుండి జరిగే జాతీయ స్థాయి సరస్ మేళాలో వివిధ రాష్ట్రాల నుండి ప్రజలు భారీ ఎత్తున పాల్గొనే అవకాశాలు ఉన్నందున వారు వాడుకునే నీరు ఆ ప్రాంగణంలోని స్తంభించిపోయి, ఎటువంటి అనారోగ్యమైన వాతావరణం కలగకుండా ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థను స్థాపించి వాడుకనీరు సజావుగా ఎప్పటికప్పుడు తొలగించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు. శనివారం ఉదయం భవానిపురంలో జరుగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసే సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ, సందర్శకులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా వినియోగించిన నీరు సక్రమంగా ప్రవహించేలా ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, మరోవైపు పేరుకుపోయిన వ్యర్థాలను నిరంతరం తొలగిస్తూ పరిసరాలను పరిశు భ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సి.హెచ్. నిర్మల గ్లోరీ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి. అన్నపూర్ణ, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన తదితరులు పాల్గొన్నారు.

# దేశ యువతను చూసి అంత భయం ఎందుకు నరేంద్ర మోడీ కి

**● ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి ● సర్ తో ముమ్మాటికి ప్రజాస్వామ్యానికి ప్రమాదం ● సర్ తో రాజ్యాంగం మీద దాడి చేయిస్తున్నారు ● 13.5 కోట్ల భారతీయుల ఓట్ల తొలగింపుతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది ● ప్రజలు ఎన్నుకున్న పాలకులు కావాలి ఈవీఎంలు మేనేజ్ చేసిన ప్రభుత్వాలు వద్దు**





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 10 :(వార్త ప్రభ ప్రతినిధి)** సర్ ప్రక్రియ ద్వారా భారతీయ పౌరుల 13.5 కోట్ల ఓట్ల తొలగింపు పై నిరసన ప్రదర్శన స్టేట్ ఎలక్షన్ కమిషన్ కార్యాలయం వద్ద ,బందర్ రోడ్డు, విజయవాడ పోతిన వెంకట మహేష్.. సామాజిక కార్యకర్త విజయవాడ ,బి వి రావు ఆడిటర్ కైకలూరు నియోజకవర్గ నాయకులు .ఎస్ వి బాబు సామాజిక కార్యకర్త పెడన నియోజకవర్గ నాయకులు .పులిపాక ప్రకాష్ జనసేన పార్టీ నాయకులు ఉమ్మడి కృష్ణాజిల్లా మరియు టీం పోతిన మహేష్ నాయకుల ఆధ్వర్యంలో శనివారం నిరసన జరిగింది.ఎలక్షన్ కమిషన్ కార్యాలయం కి చేరుకున్న మహేష్ ను నిరసన ప్రారంభించిన అనంతరం అక్రమంగా అరెస్టు చేసి పీక నొక్కుతూ బస్సులో విజయవాడ నగరంలో పలు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పిన అనంతరం జి కొండూరు పోలీస్ స్టేషన్కు తరలించారు. సాయంత్రం నాలుగు గంటలకు జామీను మీద పోతిన మహేష్ ని విడుదల చేసినారు. అనంతరం పోతిన మహేష్ మాట్లాడుతూ దేశ యువతని చూస్తే దేశ యువతను చూస్తే నరేంద్ర మోడీ కి ఎన్డీఏ ప్రభుత్వానికి అంత భయం ఎందుకు, ఢిల్లీని ఈరోజు దిగ్బంధించాల్సిన అవసరం ఏమొచ్చింది, యువత రాజ్యాంగం పై దాడి జరుగుతుందని ప్రజాస్వామ్యానికి రక్షణ లేదని ప్రపంచంలోని అతి పెద్దదైనటువంటి ప్రజాస్వామ్యమైన భారత దేశంలోనే ప్రజాస్వామ్యానికి ముప్పు ఉందని దేశ యువత ప్రశ్నిస్తుంటే వారందరినీ కావాలని పరాయి దేశానికి చెందిన వారిని చిత్రీకరిస్తూ ఢిల్లీని దిగ్బంధనం చేశారంటే దేశ యువత సరైన దశలోనే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుందని, ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తప్పు చేయకపోతే ఆయనకీ ఎందుకు కేంద్ర ప్రభుత్వం గానీ భారతీయ జనతా పార్టీ గానీ అండగా నిలుస్తుందో దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి. ఎస్ ఐ ఆర్ లో 13.5 కోట్ల మంది భారత దేశ పౌరుల ఓట్ల తొలగించడం అంటే ఇది ముమ్మాటికి ప్రజాస్వామ్యం మీద దాడే, భారతదేశ పౌరులు కాకపోతే కేంద్ర ప్రభుత్వం తక్షణమే వారిని దేశ సరిహద్దులు దాటించి పంపించండి, ఎస్ ఐ ఆర్ లు ముఖ్యంగా 2026 నుంచి ఫామ్ -6 మరియు ఫామ్ -7లో మార్పులు ఎలా చేశారు ఎవరి అనుమతితో చేశారు? ఎవరైనా కొత్తగా ఓటరు నమోదు కావాలంటే గత ఎస్ఐఆర్లో వారి వివరాలు ఉన్నాయా లేవా వారి తల్లిదండ్రులయ్యి వారి తాతది నానమ్మది వివరాలు ఉన్నాయా లేవా అనేది నమోదు చేయకపోతే ఫామ్ సిక్స్ ముందుకు సాగే పరిస్థితి లేదు, చట్టబద్ధంగా అన్ని పత్రాలు సమర్పించిన తర్వాత కూడా అతను ఓటరుగా హక్కు పొందలేకపోతున్నారంటే ఎన్నికల కమిషన్ యొక్క ఏకపక్ష వైఖరి ప్రతి ఒక్కరికి అర్థమైంది.ప్రజాస్వామ్యాన్ని రక్షించే బాధ్యత ఈ దేశ యువత తీసుకుంటే వారిని నిర్బంధించడానికి మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్లో అర్ధరాత్రి పూట 52 లక్షల ఓట్లు పోలయ్యాయని చెప్తున్నారు. ఈ అంశాన్ని అనేక సందర్భాల్లో నాయకులు మేధావులు బయటకు వచ్చి చెప్పారు 2026 ఎస్ఐఆర్లో 46 లక్షల కోట్లు తొలగించారు. 2024లో అక్రమంగా పోలిన 52 లక్షల ఓట్లను 2026లో తొలగించారా అంటే ఇప్పుడు ప్రభుత్వం ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజల తీర్పుకు అనుగుణంగా ఏర్పడలేదనే కదా దీని అర్థం. ప్రజలకు ఇచ్చిన తీర్పు కనుగుణంగా ప్రభుత్వాలు ఏర్పడాలి కానీ ఈవీయం లు ,ఎన్నికల కమిషనర్ నిర్దేశించిన పాలకులు వద్దు.ప్రజాస్వామ్యాన్ని రక్షించే బాధ్యత బ రాజ్యాంగాన్ని రక్షించే బాధ్యత పోలీస్ వారిపై ఉందా లేదా? శనివారం విజయవాడ పోలీస్ ఇబ్బంది పెట్టింది మహేష్ను ప్రకాష్ ను రావు ని బాబును కాదు రాజ్యాంగాన్ని రాసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని అక్రమంగా అరెస్టు చేశారు. ప్రజల తీర్పుకి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా నడిచే ప్రభుత్వాలు నిలబడవని హెచ్చరిస్తున్నాం. ఇవాళ నలుగురు మాత్రమే అనుకోవద్దు. ఈ సంఖ్య పెరుగుతుంది ప్రజా పోరాటాలు చేస్తాం ప్రజల కోసం కచ్చితంగా నిలబడతామన్నారు.

# న్యూ రాజీవ్ గాంధీ నగర్‌లో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు!

**● కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు ● సంప్రదాయ వస్త్రధారణలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు, చిన్నారులు ● ఆటపాటలతో మార్మోగిన బస్తీ.. ఘనంగా ఏర్పాట్లు చేసిన కమిటీ**





**జగద్గిరిగుట్ట, అక్టోబర్ 10, (వార్తాప్రభ)** : న్యూ రాజీవ్ గాంధీ నగర్ కాలనీలో పూల పండుగ బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. కాలనీ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా జరిగిన ఈ వేడుకల్లో కాలనీలోని మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేశారు.

**తీరొక్క పూల బతుకమ్మలు.. ఉత్సాహంగా ఆటపాటలు:**
తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను కాలనీ మధ్యలో ప్రతిష్టించి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందరూ ఒకే చోట చేరి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ, లయబద్ధంగా చప్పట్లు కొడుతూ ఆడారు. మహిళలంతా సాంప్రదాయ పట్టు వస్త్రాలు, ఆభరణాలు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.." అంటూ మహిళలు పాడిన పాటలతో కాలనీలో పండుగ వాతావరణం వెల్లివిరిసింది.

**కమిటీ ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు:**
ఈ వేడుకల్లో పాల్గొన్న కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా న్యూ రాజీవ్ గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ప్రత్యేక దృష్టి సారించింది. లైటింగ్, సౌండ్ సిస్టమ్‌తో పాటు బతుకమ్మల నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లను కమిటీ సభ్యులు దగ్గరుండి పర్యవేక్షించారు. అందరూ ఒకే చోట చేరి సమిష్టిగా ఈ పండుగను జరుపుకోవడం బస్తీ వాసుల ఐకమత్యానికి నిదర్శనమని కమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కూడా కాలనీ అభివృద్ధి కోసం, ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ కోసం కమిటీ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో న్యూ రాజీవ్ గాంధీ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మధుసాగర్, ఉపాధ్యక్షులు కిషోర్ చారి, జనరల్ సెక్రెటరీ అనిల్ సింఘాని, ట్రెజరర్ కృష్ణ వేల్పుల, జాయింట్ సెక్రెటరీ పోచయ్య, సలహాదారులు రాములు, కార్యవర్గ సభ్యులు వెంకటేష్, భాస్కర్ తదితరులతో పాటు భారీ సంఖ్యలో మహిళలు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

# బుడమేరు కాలువలో విస్తృతంగా పరిశుభ్రత కార్యక్రమాలు





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 10 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ సూచనలతో స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి పేట, అమరావతి కాలనీ ప్రాంతాల్లోని బుడమేరు కాలువలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ మాట్లాడుతూ, స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా నగరంలోని బందర్, రైవస్, ఏలూరు, బుడమేరు కాలువల్లో బిక్లీనింగ్ వాటర్ బాడీస్‌బి కార్యక్రమం కింద విస్తృతంగా పరిశుభ్రత పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కాలువల్లో పేరుకుపోయిన తేలియాడే వ్యర్థాలు, గుర్రపుడెక్క మొక్కలను తొలగిస్తూ నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కాలువలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా పరిసరాల పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు దోమల వ్యాప్తిని నియంత్రించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నగర ప్రజలు కూడా కాలువల్లో చెత్తాచెదారం వేయకుండా సహకరించాలని కోరారు.

# నిరసనలు అడ్డుకోవడం ప్రజాస్వామ్యకం

### డీసీసీ అధ్యక్షులు బొర్రా కిరణ్

**చలో రాజభవన్ కు వెళ్తున్న బొర్రా కిరణ్ అరెస్టు చేసిన పోలీసులు**



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 10(వార్తా ప్రభ ప్రతినిధి):**ప్రజాస్వామ్య బద్ధంగా నిరసనలు చేస్తున్న విపక్షాలను అడ్డుకోవడంలో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యకంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్. రాష్ట్ర పీసీసీ చీఫ్ వైయస్ షర్మిల పిలుపుమేరకు చలో లోక్భవన్ కార్యక్రమానికి వెళుతున్న బోర్ర కిరణ్ ను మార్గమధ్యలో ఆపి అరెస్ట్ చేశారు ఇబ్రహీంపట్నం పోలీసులు. పోలీసుల చర్యను తీవ్రంగా ఖండించారు కిరణ్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'చలో లోక్ భవన్' కార్యక్రమాన్ని వెళ్తున్న జాతియా నాయకులను,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మరియు ఇండియా కూటమి నాయకులను కూటమి ప్రభుత్వం అడ్డుకోవడం అరెస్ట్ లు చేయటం దుర్మార్గమని అన్నారు. కూటమి ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీని అణచివేయాలని చూస్తోందని, ఈ కూటమి పాలన పూర్తిగా బీజేపీ మోడీ - అమిత్ షా ల చేతుల్లోకి వెళ్ళిపోయిందని ఆరోపించారు.ఓట్ల చోరీకి పాల్పడుతున్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) ఓట్ల దొంగ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే మరియు ఇండియా కూటమిలోని అన్ని పార్టీలు మరియు యువత కలిసి ఈ ఉద్యమాన్ని చేస్తుంటే మోడీ - అమిత్ షా లు ఈ ఉద్యమాన్ని అణచి వేయాలని అనుకోవటం వాళ్ళ అవివేకం అని అన్నారు. రాష్ట్రము లో అధికారం లో వున్నా బీజేపీ మిత్ర పక్షాలైన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని గట్టిగా చెప్పలేకపోవటం,బీజేపీని గట్టిగా నిలదీయలేకపోవటం వలన ప్రజలు విమర్శిస్తున్నారని అన్నారు. వైసిపి అధినేత జగన్ తెర వెనుక బీజేపీకి మద్దతుగా ఉండట బాధాకరం అని అన్నారు.రాష్ట్రము లో మూడు ప్రాంతీయ పార్టీ లు కూడా ప్రత్యక్షంగా మరియు పరోక్షము గా బీజేపీ కే సపోర్ట్ చేయటం ప్రజలందరూ గమనిస్తూనే వున్నారని అన్నారు.ఎన్ని అరెస్టులు చేసినా ఈ ఉద్యమం ఆగదని బొర్రా కిరణ్ స్పష్టం చేశారు.

# సోమవారం వీఎంసీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 10 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఈ నెల 12వ తేదీ సోమవారం రద్దు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉండటం, ఉత్సవాల ఏర్పాట్ల విధుల్లో అధికారులు నిమగ్నమై ఉండటాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

# ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా నూతన విద్యార్థుల స్వాగత వేడుకలు

**తిరుపతి: అక్టోబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తిరుపతి--కరకంబాడి మార్గమధ్యంలో ఉన్న ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో నూతన విద్యార్థుల స్వాగత వేడుకలు (ఫ్రెషర్స్ డే) ఘనంగా నిర్వహించారు. కళాశాలలో కొత్తగా అడుగుపెట్టిన మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో స్వాగతం పలుకుతూ, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు సీనియర్ విద్యార్థులు, అధ్యాపకులతో సత్సంబంధాలు ఏర్పరచుకోవాలనే ఉద్దేశంతో ఈ వేడుకలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని వివిధ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. నూతన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు, అధ్యాపకులు సాదరంగా స్వాగతం పలికి, కళాశాల వాతావరణం, విద్యా విధానాలు, విద్యార్థుల మధ్య పరస్పర సహకారం గురించి అవగాహన కల్పించారు. ఉన్నత విద్యాభ్యాసంలో కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న విద్యార్థులకు ఈ వేడుకలు మధురమైన అనుభూతిని అందించాయి. వేడుకల్లో భాగంగా ఉదయం ద్వితీయ




సంవత్సరం విద్యార్థులు, మొదటి సంవత్సరం విద్యార్థుల మధ్య ప్రత్యేక పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా నూతన విద్యార్థులు తమ సహచరులు, సీనియర్లతో పరిచయాలు పెంచుకున్నారు. తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు కళాశాలలో చదువుకు సంబంధించిన విషయాలు, పాఠ్యేతర కార్యక్రమాలు, వివిధ అవకాశాల గురించి తెలుసుకున్నారు. సీనియర్ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ జూనియర్లకు పలు సూచనలు అందించారు. అనంతరం సాయంత్రం కళాశాల మైదానంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ఉత్సాహంగా నృత్య ప్రదర్శనలు చేస్తూ, పాటలకు అనుగుణంగా కేరింతలు కొడుతూ సందడి చేశారు. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు ఒకచోట చేరి ఆనందోత్సాహాల మధ్య వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థుల నృత్యాలు, ఉత్సాహభరితమైన ప్రదర్శనలు కార్యక్రమానికి మరింత కళను తీసుకొచ్చాయి. కొత్త విద్యా జీవితాన్ని ప్రారంభిస్తున్న విద్యార్థులకు స్వాగతం పలకడంతో పాటు వారిలో స్నేహభావం, ఐక్యత, పరస్పర సహకార స్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ వేడుకలు దోహదపడ్డాయి. చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు ప్రతిభను చాటుకోవడానికి ఇలాంటి వేడుకలు మంచి వేదికగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఉత్సాహభరిత వాతావరణంలో ఫ్రెషర్స్ డే వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

## శ్రీ త్రికోటేశ్వరలో ముందస్తు విజయదశమి వేడుకలు



**చేజర్ల అక్టోబర్ 10 (వార్తాప్రభ)** విజయదశమి సందర్భంగా ఆదురుపల్లిలోని శ్రీత్రికోటేశ్వర విద్యాలయంలో దశరా వేడుకలు సుప్రియా మేడమ్ మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిషాసుర వధ మరియు రావణాసుర దహనం కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థినులు నవదుర్గా వేషధారణతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ వేడుకలలో మహిషాసురుని వద మరియు రావణుడిపై రాముడి సాధించిన విజయానికి గుర్తుగా రావణ దహనం కార్యక్రమాలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీనరసారెడ్డి డైరెక్టర్ సుధాకర్ రెడ్డి ప్రధానోపాధ్యాయులు కృష్ణ చైతన్య మాట్లాడుతూ చెడు మీద మంచి గెలిచిన తీరుకు ప్రతీకగా విజయ దశమి పండుగ జరుపుకుంటామనీ విద్యార్థులందరూ మంచి మార్గంలో నడిచి ఉన్నత శిఖరాలను అందుకోవాలని అందరికీ దశరా శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రత్యేక వేషధారణ వేసిన బాల బాలికలను బహుమతులతో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు బాల బాలికలు పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

**గన్నవరం, అక్టోబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో 33/11కేవీ వీరపనేనిగూడెం సబ్ స్టేషన్ మెయింటినెన్స్ వర్క్ నిమిత్తం సరఫరా నిలిపివేయబడును.. రేపు అనగా (11-10-26) ఆదివారం ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 01:00గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సి పి డి సి ఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ డి. విశ్వేశ్వర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు వీరపనేనిగూడెం, తెంపల్లి, బల్లిపర్రు, మర్లపాలెం హౌసింగ్ కాలనీ, మెట్లపల్లి, కొత్తగూడెం, చింతగుంట, కంఢ్రిక, చిక్కవరం, గొల్లనపల్లి, బిబి గూడెం, బిబి గూడెం రోడ్, స్టేట్ స్కూల్ ఏరియా, జయశ్రీ పాలిమర్స్, ఉష స్పిన్ కోట్ ప్రాంతాలలో సరఫరా నిలిపి వేయబడును కావున గృహ వినియోదారులు, వ్యవసాయ వినియోగదారులు, వ్యాపార వినియోగదారులు,పరిశ్రమ వినియోగ దారులు అందరూ సహకరించగలరని వారు కోరారు. అదే విధంగా వ్యవసాయ కరెంటు ఉదయం 5:00 నుంచి 10:00లి వరకు మరియు మధ్యాహ్నం 01:00నుంచి సాయంత్రం లి5:00లి వరకు ఉంటుందన్నారు.

## నిరుపేదలకు అన్నదానం...



**గుడ్లవల్లేరు:అక్టోబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యాన స్థానిక లయన్స్ సేవాభవన్‌లో శనివారం నిరు పేదలకు అన్నదానం నిర్వహించారు. వల్లభనేని సుబ్బారావు, జానకమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వందలాది మంది పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారని లయన్స్ చైర్మన్ కల్యాణపు నవాబు తెలిపారు. నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సిబ్బందికి సన్మానం




**పెనుగంచిప్రోలు - అక్టోబర్ 10( వార్త ప్రభ )** ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు మాసోత్సవాల్లో భాగంగాపెనుగంచిప్రోలు మండలం లోని ముండ్లపాడు అంగన్వాడి కేంద్రంలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని శనివారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు .ఈ సందర్భంగా సేవా సంకల్ప భాగంగా అంగన్వాడి ఉత్సవంలో తోట చర్ల ,నవాబుపేట ,కొనకంచి , ముండ్లపాడు గ్రామాల అంగన్వాడి సిబ్బందిని ఘనంగా సన్మానించారు. 20 47 వికసిత్ భారత లక్ష్యంగా కేంద్రాలను తీర్చిదిద్దాలని ప్రధాని ఆకాంక్ష అన్నారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి కల్లూరి శ్రీవాణి ,జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి మన్నే మాధవి, మండల బీజేవైఎం అధ్యక్షుడు హేమంత్ కుమార్, మండల కిసాన్ మోర్చా ఇన్చార్జి బొడ్డు మల్లికార్జునరావు, మండల అధ్యక్షులు నరసింహస్వామి , రామారావు , గోపి , అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్వాడీల వేతనాల పెంపునకు ప్రభుత్వం కట్టుబడి ఉంది: పులివర్తి నాని

**- అర్హులకు అంగన్వాడీ మహిళలకు స్వగ్రామాల్లోనే ఇంటి స్థలాలు**

**చంద్రగిరి:అక్టోబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, అంగన్వాడీల వేతనాల పెంపు కూడా తప్పకుండా జరుగుతుందని భరోసా ఇచ్చారు. చంద్రగిరిలోని ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో తెలుగునాడు అంగన్వాడీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల్లో రాజకీయాలకు తావులేదని, చిన్నారులకు సేవలందిస్తున్న కార్యకర్తలు, ఆయాలను ఎప్పుడూ ఇబ్బంది పెట్టబోమని స్పష్టం చేశారు. ఇటీవల భర్తీ చేసిన 62 అంగన్వాడీ పోస్టులను రాజకీయ ప్రమేయం లేకుండా అర్హులకే కేటాయించినట్లు తెలిపారు. గతంలో అంగన్వాడీలు సమ్మె చేసినప్పుడు తాను, తన సతీమణి పులివర్తి సుధారెడ్డి వారికి అండగా నిలిచామని గుర్తుచేశారు. వచ్చే నెల నుంచి సుధారెడ్డి గ్రామాల్లో పర్యటించి మహిళల సమస్యలను తెలుసుకుంటారని, స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం అంగన్వాడీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తోందని నాని పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీ, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకం



కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు అన్నదాత సుఖీభవ వంటి పథకాలను వివరించారు. అంగన్వాడీలకు వేసవి సెలవులు, వైద్య సెలవులు, స్వచ్ఛంద పదవీ విరమణ వంటి వెసులుబాట్లు కల్పించినట్లు యూనియన్ అధ్యక్షురాలు తెలిపారు. నియోజకవర్గంలో ఇళ్లు లేని అర్హులైన అంగన్వాడీ మహిళలకు స్వగ్రామాల్లోనే ఇంటి స్థలాలు కేటాయించేందుకు త్వరలో ప్రత్యేక ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయిస్తామని నాని వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి శుక్రవారం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు, పర్యవేక్షకులు, అంగన్వాడీ కార్యకర్తలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యంపై అవగాహనతోనే ఆరోగ్యకరమైన జీవితం

**- ఎస్వీ వైద్య కళాశాల ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ ర్యాలీ**

**తిరుపతి, అక్టోబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్వీ వైద్య కళాశాల, రుయా ఆసుపత్రి మానసిక వైద్య విభాగం, మత్తు వ్యసన నిర్మూలన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్, అదనపు వైద్య విద్య సంచాలకులు డాక్టర్ జి. రవి ప్రభు, రుయా ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎస్వీ వైద్య కళాశాల నుంచి స్విమ్స్ సర్కిల్ వరకు సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ జి. రవి ప్రభు మాట్లాడుతూ మానసిక ఒత్తిడితో బాధపడుతున్న వారితో సానుభూతితో మాట్లాడటం, వారి సమస్యలను శ్రద్ధగా వినడం ద్వారా ఉపశమనం కలిగించవచ్చన్నారు. యోగా, ధ్యానం, వ్యాయామం నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని వైద్య విద్యార్థులకు, రోగులకు సూచించారు. మానసిక సమస్యలపై అవగాహనతో పాటు కౌన్సెలింగ్ సేవలు అందించడం అవసరమన్నారు. డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ ప్రమాదాల్లో గాయపడిన వారికి వైద్య చికిత్సతోపాటు మానసిక స్థితిని అర్థం చేసుకుని కౌన్సెలింగ్ అందించడం ముఖ్యమన్నారు. దీనివల్ల బాధితుల్లో ఆత్మవిశ్వాసం, మనోధైర్యం పెరుగుతాయని తెలిపారు. మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ కౌమారదశలోని పిల్లలు, యువత చదువు, కెరీర్, భవిష్యత్తు వంటి




అంశాలతో ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఆందోళన, భయం, ఇతర మానసిక సమస్యలు ఎదురైనప్పుడు రుయా ఆసుపత్రిలోని 22వ నంబరు మానసిక వైద్య విభాగాన్ని సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. మత్తు వ్యసనాలకు దూరంగా ఉంటూ మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు డాక్టర్ రవి ప్రభు, డాక్టర్ మధుసూదన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ భారతి, డాక్టర్ శారద, ఇతర వైద్యులు, పీజీ, యూజీ విద్యార్థులు, మత్తు వ్యసన నిర్మూలన కేంద్రం సిబ్బంది, మనస్తత్వ నిపుణుడు డాక్టర్ గుండ్లపల్లి మురళి, నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల ప్రజాసంబంధాల అధికారి వీర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన

**● కొండపల్లిలో రూ.90 లక్షలతో రెండు అభివృద్ధి పనులకు శంకుస్థాపన ● ఆర్‌సీఎం కాలనీలో రూ.50 లక్షలతో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్.. 1 నుంచి 4వ వార్డుల్లో రూ.40 లక్షలతో తాగునీటి పైపులైన్లు ● మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్**



**ఇబ్రహీంపట్నం,అక్టోబర్ 10( వార్తా ప్రభ ప్రతినిధి):**యువత నైపుణ్యాభివృద్ధికి తోడ్పాటునందించడంతోపాటు, ప్రజలకు మెరుగైన తాగునీటి సదుపాయాలు కల్పించే లక్ష్యంతో కొండపల్లి మున్సిపాలిటీలో రెండు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు శనివారం సాయంత్రం ఆర్‌సీఎం కాలనీలో డి.ఎం.ఎఫ్ నిధులు రూ.50 లక్షలతో నిర్మించనున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ భవనానికి, మున్సిపాలిటీలోని 1 నుంచి 4వ వార్డుల్లో డి.ఎం.ఎఫ్.టి నిధులు రూ.40 లక్షలతో చేపట్టనున్న తాగునీటి పైపులైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

**యువత భవిష్యత్తుకు నైపుణ్య శిక్షణ** ఆర్‌సీఎం కాలనీలో డి.ఎం.ఎఫ్ నిధులు రూ.50 లక్షలతో నిర్మించనున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ఉపయోగపడనుంది. మారుతున్న ఉపాధి రంగాలకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఇటువంటి కేంద్రాలు దోహదపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. యువత సామర్థ్యాలను అభివృద్ధి చేసి, వారి



భవిష్యత్తుకు తోడ్పడే కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు.

**నాలుగు వార్డుల్లో తాగునీటి పైపులైన్ల నిర్మాణం**కొండపల్లి మున్సిపాలిటీలోని 1, 2, 3, 4వ వార్డుల్లో డి.ఎం.ఎఫ్.టి నిధులు రూ.40 లక్షలతో తాగునీటి పైపులైన్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ పనుల ద్వారా ఆయా వార్డుల్లో తాగునీటి సరఫరా సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రెండు అభివృద్ధి పనులను నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి, నాణ్యతలో రాజీ పడకుండా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టే పనులు దీర్ఘకాలిక ప్రయోజనాలు అందించేలా ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## అక్టోబరు 12 నుంచి తిరుమలలో శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

**- గరుడ వాహనం, స్వర్ణరథం, చక్రస్నానం ప్రత్యేక ఆకర్షణలు**



**తిరుమల, అక్టోబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 12 నుంచి 20వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా అక్టోబరు 16న గరుడ వాహనసేవ, 17న పుష్పక విమానం, 19న స్వర్ణరథోత్సవం, 20న చక్రస్నానం ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి. భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించేలా తిరుమల తిరుపతి దేవస్థానం ఏర్పాట్లు చేపట్టనుంది చాంద్రమానం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకోసారి అధికమాసం వస్తుంది. ఇలాంటి సందర్భాల్లో భాద్రపద మాసంలో వార్షిక బ్రహ్మోత్సవాలు, ఆశ్వయుజ మాసంలోని దసరా నవరాత్రుల్లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఉత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం నిర్వహించరు. సాధారణంగా ఉదయం వాహనసేవలు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవలు రాత్రి 7 నుంచి 9 గంటల వరకు జరుగుతాయి. గరుడ వాహనసేవ మాత్రం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 11.30 గంటల వరకు నిర్వహించనున్నారు. వాహనసేవల వివరాలు ఇలా ఉన్నాయి: అక్టోబరు 11న రాత్రి 7 నుంచి 9 గంటల వరకు అంకురార్పణం నిర్వహిస్తారు. అక్టోబరు 12న ఉదయం బంగారు తిరుచ్చి ఉత్సవం, రాత్రి పెద్దశేష వాహనసేవ జరుగుతాయి. 13న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం; 14న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం; 15న ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనసేవ నిర్వహిస్తారు. అక్టోబరు 16న ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం గరుడ వాహనసేవ; 17న ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం 4 గంటలకు పుష్పక విమానం, రాత్రి గజ వాహనసేవ జరుగుతాయి. 18న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం; 19న ఉదయం 7 గంటలకు స్వర్ణరథం, రాత్రి అశ్వ వాహనసేవ నిర్వహిస్తారు. చివరి రోజైన అక్టోబరు 20న ఉదయం 6 గంటలకు చక్రస్నానం నిర్వహించనున్నారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలో ఆధ్యాత్మిక సందడి నెలకొననుండగా, స్వామివారి వాహనసేవలను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది.

## యువత నైపుణ్యాభివృద్ధికి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ దోహదం

**వెస్ట్ ఇబ్రహీంపట్నంలో రూ.25 లక్షలు, కొండపల్లిలో 50 లక్షలతో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల కు శ్రీకారం**

**నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలి**

**మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్**



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 10(వార్తా ప్రభ ప్రతినిధి)**:యువతలో నైపుణ్యాలను పెంపొందించి, వారి ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఎంతగానో దోహదపడతాయని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వెస్ట్ ఇబ్రహీంపట్నంలో డి.ఎం.ఎఫ్ నిధులు రూ.25 లక్షలు, కొండపల్లి ఏపీహెచ్ఎంఈఎల్ సమీపంలో 50 లక్షలతో వ్యయంతో నూతనంగా నిర్మించనున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ భవన నిర్మాణానికి ఆయన శనివారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ యువతకు అవసరమైన నైపుణ్యాలను అందించడంతోపాటు, వారి సామర్థ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి కేంద్రాలు ఉపయోగపడతాయని అన్నారు. స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన అవకాశాలు అందుబాటులోకి రావడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తోందని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు వివరించారు. ప్రజల అవసరాలను గుర్తించి, ముఖ్యంగా పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, యువతకు అభివృద్ధి అవకాశాలను కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులకు, నిర్మాణ బాధ్యులకు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ సూచించారు. ప్రజాధనంతో చేపడుతున్న పనులు దీర్ఘకాలం ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని, నిర్మాణ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ అక్కల రామ్మోహనరావు (గాంధీ) , కూటమిన్ నేతలు పాల్గొన్నారు.

## టిఎస్టిఎస్ మాజీ చైర్మన్ పాటిమీది జగన్ మోహన్ రావు పై తీవ్ర ఆగ్రహం...

**ఎమ్మెల్సీ బల్మూరీ వెంకట్ పై వ్యాఖ్యలను ఖండించిన కూకట్ పల్లి కాంగ్రెస్ నాయకుడు జిట్ట సునీల్ యాదవ్..**



**కూకట్ పల్లి, అక్టోబర్ 10(వార్తా ప్రభ):**తెలంగాణ ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పైన మాజీ టీఎస్ టీఎస్ చైర్మన్ పాటిమీది జగన్మోహన్ రావు చేసిన వ్యాఖ్యలను కూకట్ పల్లి కాంగ్రెస్ సీనియర్ యూత్ నాయకుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎన్ ఎస్ యు ఐ మాజీ అధ్యక్షుడు సునీల్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. బల్మూరి వెంకట్ సంబంధించి వ్యక్తిగత జీవితాన్ని తెరపైకి తేవడం మంచి పద్ధతి కాదని అన్నారు. ఆ విషయం పైన కూకట్ పల్లి గ్రామ ప్రజలకు అందరికీ తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. వారి ఇద్దరికీ నచ్చకనే విడిపోయారని తర్వాత బల్మూరి వెంకట్ వేరే వివాహం చేసుకున్నారని అన్నారు. రెండు నెలల క్రితం ఇదే జగన్మోహన్ రావు ఇంటి ముందు ఓ మహిళ రోడ్డుమీద బైఠాయించి తనకు న్యాయం చేయాలని తనను హింసిస్తున్నారని ఆరోపించిన ఘటనను మీరు మరిచిపోయారా అని ప్రశ్నించారు. ఆడపిల్లలను అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయడం మంచిది కాదని హెచ్చరించారు. బల్మూరి వెంకట్ ను విమర్శిస్తే కేటీఆర్ అభినందించి పదవులు ఇస్తారని ఆశపడి మీరు ఈ పని చేయడం మంచి సంస్కారం కాదని అన్నారు. వెంటనే జగన్మోహన్ రావు బహిరంగ క్షమాపణ చెప్పాలని జిట్టా సునీల్ తో పాటు కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.

## ఓటు చోరులకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మద్దతుగా ఉండటం సిగ్గుచేటు

**అక్రమ అరెస్టులు దుర్మార్గం... అక్రమ అరెస్టులకు ఖండిస్తూ రేపు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు**

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబురావు**




**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 10(వార్తా ప్రభ ప్రతినిధి):** ఓటు చోరీ నిందితులకు అండగా ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు ఆందోళనకారులను అరెస్టు చేపించటం దుర్మార్గమైన చర్య అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యులు సిహెచ్ బాబురావు అన్నారు.విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబురావుతో 30 మంది సిపిఎం ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కు తరలించారు.పోలీస్ స్టేషన్లో బాబురావు మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా 13 కోట్ల ఓట్లను చోరీ చేసిన కేంద్ర ఎన్నికల కమిషనర్, ఓట్ల దొంగ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సూత్రధారులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం శాఖ మంత్రి అమిత్ షా ల చేతిలో కీలుబొమ్మగా మారిన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్య విలువలను తుంగలోకి చెబుతున్నారని విమర్శించారు. అరెస్ట్ అయిన వారిలో బాబురావు తో పాటు కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి , ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల సావిత్రి , సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎన్ సి హెచ్ సుప్రజ , జిల్లా కార్యదర్శి ఏ కమల తదితరులు ఉన్నారువామపక్షాల నాయకుల అక్రమ అరెస్టులకు నిరసనగా రేపు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేయాలనీ, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని పిలుపునిచ్చారు.ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ వద్ద సిపిఎం మండల కార్యదర్శి యం మహేష్, సీనియర్ నాయకులు విట్టల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలి

**ఆర్యవైశ్య జేఏసీ నాయకులు అంబికా కృష్ణ**



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 10: (వార్త ప్రభ ప్రతినిధి)** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించి తగినన్ని సీట్లు ఇవ్వాలని రాజకీయ పార్టీల నాయకులకు మాజీ ఎమ్మెల్యే, ఆర్యవైశ్య జేఏసీ నాయకులు అంబికా కృష్ణ విజ్ఞప్తి చేశారు. శనివారం భవానిపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డు లోని మయూరి గ్రాండ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బిజెపి, వైసిపి పార్టీలు ఆర్యవైశ్యులకు తగినన్ని సీట్లను కేటాయించాలని తాము ఆర్యవైశ్య జేఏసీ తరపున ఆయా పార్టీల నాయకులను కలిసి తాము తయారుచేసిన షార్ట్ లిస్టులను అందజేస్తామని చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఆర్యవైశ్యులు తమ జేఏసీకి తమ అప్లికేషన్లు ఇవ్వాలని ఆయన కోరారు. ఆంధ్రప్రదేశ్లో ఆర్యవైశ్యుల జనాభా ఎనిమిది శాతంగా ఉందని, కనీసం 30 లక్షల మంది ఆర్యవైశ్యులు ఉన్నారని చెప్పారు. రానున్న స్థానిక సంస్థలు ఎన్నికల్లో రెండు మేయర్ సీట్లు, తగినన్ని పురపాలక చైర్మన్లు, కౌన్సిలర్లు ఆర్యవైశ్యులకు ఇచ్చి రాజకీయంగా వారి అభివృద్ధికి సహకరించాలని వివిధ పార్టీల నాయకులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షులు కోన శ్రీనివాసరావు, ఐవిఎఫ్ అర్బన్ అధ్యక్షులు కొల్లూరు లక్ష్మణ గుప్తా, ఆంధ్రప్రదేశ్ అడిషనల్ యశ్వంత్, ఐవీఎఫ్ మహిళా యాక్టీవ్ వర్కింగ్ ప్రెసిడెంట్ తొండెపు రాధా గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## అన్నమయ్యపురం లో భక్తులను అలరించిన అన్నదానం

**- అన్నమస్వరార్చన**




**శేరిలింగంపల్లి,అక్టోబర్ 10 (వార్తాప్రభ ):** అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించిన అన్నదానం--అన్నమ స్వరార్చన కార్యక్రమంలో భాగంగా సౌల్‌ఫుల్ కర్ణాటక సంగీత అకాడమీ ఆధ్వర్యంలో అన్నమ స్వరార్చన భక్తిశ్రద్ధలతో జరిగింది.గురువు కృష్ణప్రియ మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమం విష్ణు సహస్రనామ పారాయణం, లక్ష్మీ అష్టోత్తరం, అన్నమయ్య అష్టోత్తరం,గురు స్తుతితో ప్రారంభమైంది.అకాడమీ శిష్యులు అన్నమాచార్య సంకీర్తనలను సమిష్టిగా ఆలపించి భక్తులను అలరించారు. ‘అదివో అల్లదివో’, ‘ముద్దుగారే యశోద’, ‘కొండలలో నెలకొన్న’, ‘చాలదా హరినామ’ తదితర సంకీర్తనలు ఆకట్టుకున్నాయి.శాస్త్రి కీబోర్డుపై, స్వరూప్ తబలాపై వాద్య సహకారం అందించారు.అన్నమాచార్య భావనా వాహిని వ్యవస్థాపకురాలు పద్మశ్రీ డా. శోభారాజు, మేనేజింగ్ ట్రస్టీ డా. నందకుమార్ పాల్గొన్న గురువులు, కళాకారులను స్వామివారి జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం మంగళహారతి, ప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసింది.

## “అనురాగ్” లో ఆనందోత్సాహాలతో ఘనంగా బతుకమ్మ వేడుకలు









**కాప్రా, అక్టోబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** యెల్లారెడ్డి గూడలో కల మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో శనివారం తెలంగాణ సంస్కృతిని తెలిపే బతుకమ్మ పండుగను ఎంతో ఘనంగా, వైభవోపేతంగా నిర్వహించారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ, ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీకగా జరుపుకునే బతుకమ్మ పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు కలిసి సంతోషంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా “అనురాగ్” పాఠశాల ప్రాంగణాన్ని రంగురంగుల పూలతో అందంగా అలంకరించారు. వివిధ రకాల పూలు అయిన తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి పూలతో అలంకరించినారు. విద్యార్థుల చిరునవ్వులు, ఆటల పాటలతో పాఠశాల లో పండుగ శోభను సంతరించుకుంది.ఈ సందర్భముగా యమ్. వాసుదేవ్ నాయర్, రిటైర్డ్ డైరెక్టర్, యన్,సి,టి,సి, వీణ వాసుదేవ్ అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమమును డా. రామ్ పిల్లలతో కలిసి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రసన్నబతుకమ్మ పండుగ గురించి వివరిస్తూ బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదు; అది ప్రకృతిని ప్రేమించడం, మహిళల గౌరవాన్ని చాటడం, కుటుంబ సభ్యులు మరియు సమాజంలోని ప్రతి ఒక్కరితో ఆనందాన్ని పంచుకోవడం వంటి గొప్ప విలువలను తెలియజేస్తుంది అని తెలిపారు. ఈ పండుగ మన తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుంది. ఇలాంటి పండుగలను పాఠశాలల్లో నిర్వహించడం ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు, వారిలో సామాజిక భాగస్వామ్యం, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత వంటి లక్షణాలను ప్రోత్సహించవచ్చు అని అన్నారు.ఉపాధ్యాయులు విద్యార్థులకు బతుకమ్మ పండుగ విశిష్టతను, దాని వెనుక ఉన్న సాంస్కృతిక ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు తమకు తోచిన విధంగా పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ, బతుకమ్మ చుట్టూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భముగా డా. రామ్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రేమ, ఆప్యాయత, ప్రోత్సాహం ఎంతో అవసరం అని తెలుపుతూ, ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ, సామర్థ్యం ఉంటాయి అని వారికి తగిన అవకాశాలు కల్పించి, ప్రోత్సహించినప్పుడు వారు కూడా తమ ఆనందాన్ని, ప్రతిభను అద్భుతంగా వ్యక్తపరచగలరు అని, ఈ బతుకమ్మ వేడుకలు విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు మరియు వారిలో ఉత్సాహాన్ని నింపాయని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఐక్యతా భావం, పరస్పర సహకారం, స్నేహభావం పెంపొందు తాయని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు తోడుగా నిలిచి, ప్రతి ఒక్కరూ వేడుకల్లో పాల్గొనేలా ప్రోత్సహించారు. విద్యార్థుల ఆనందమే తమకు నిజమైన సంతోషమని తెలియజేసారు. మొత్తంగా, మానసిక దివ్యాంగుల పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు ప్రేమ, ఆప్యాయత, సమానత్వం, సాంస్కృతిక ఐక్యతకు ప్రతీకగా నిలిచాయి. చివరగా డా. రామ్, పిట్టు బిందు అందరికి స్వీట్ ప్యాకెట్ లను మరియు కానుకలను పంచిపెట్టారు.

## సుజాతనగర్‌కు అభివృద్ధి వరాలు!

**● రూ.8.75 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్.. రూ.5 కోట్లతో సింగభూపాలెం చెరువు అభివృద్ధి ● రూ.500 కోట్లతో కొత్తగూడెం రింగ్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు ● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు ● టీపీసీసీ జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సుజాతనగర్‌తో పాటు కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. సుజాతనగర్ 22వ డివిజన్‌లో రూ. 8.75 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా టీపీసీసీ జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు కావడం సంతోషకరమన్నారు. ఈ పాఠశాల ద్వారా ప్రాథమిక విద్య నుంచి ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం వరకు ఒకేచోట నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు. సుజాతనగర్ పరిసర ప్రాంతాల విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుల కోసం కొత్తగూడెం వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని, ఈ నిర్ణయం భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

**ఇతర అభివృద్ధి పనులు:** – సింగభూపాలెం చెరువు కట్ట అభివృద్ధికి రూ.5 కోట్లు.– కొత్తగూడెం రింగ్‌రోడ్డు నిర్మాణానికి రూ.500 కోట్ల నిధులు.– బృందావనం సమీపంలో 18 ఎకరాల్లో స్టేడియం ఏర్పాటు.– మహిళలకు ఉపాధి అవకాశాలు, సుజాతనగర్‌లో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు.నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడు గణేష్, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ లాల్ సింగ్, సీపీఐ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్య లోగిలిలో దాండియా వేడుకలు



**కాకినాడ :అక్టోబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో “లక్ష్య ఫ్యామిలీ దాండియా నైట్ 2026” వేడుకలను అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో శుక్రవారం అనగా అక్టోబర్ 9వ తారీఖున ఘనంగా నిర్వహించారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డా.నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ డా. నల్లమిల్లి సుగుణా రెడ్డి, ప్రిన్సిపల్ వందన బోప్రే ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. రంగురంగుల అలంకరణలు, ఆకట్టుకునే లైటింగ్, సంగీతం, నృత్య ప్రదర్శనలతో ‘లక్ష్య’ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రతి కార్యక్రమంలోనూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని, వేడుకలను విజయవంతం చేయడంలో తమవంతు సహకారం అందించారు.భారతీయ సంస్కృతి సంప్రదాయాల వైభవాన్ని ప్రతిబింబించేలా బతుకమ్మ, గరగలు, కాళికామాత వంటి ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన దాండియా నృత్య వేడుకలు ప్రారంభించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ఉత్సాహంగా దాండియా ఆడుతూ వేడుకలకు మరింత శోభను తీసుకువచ్చారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతిఒక్కరూ దాండియా నృత్యంలో ఉత్సాహంగా పాల్గొనడంతో ప్రాంగణమంతా సంగీతం, నృత్యాలు, ఆనందోత్సాహాలతో మార్మోగింది.వేడుకల్లో భాగంగా నిర్వహించిన రావణ దహన కార్యక్రమం చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం లక్ష్య పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు చేసిన ధునుచి నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ చైర్మన్ డా. నల్లమిల్లి శేషారెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ఆత్మీయంగా మాట్లాడారు. చదువుతో పాటు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు. దాండియా వంటి సాంస్కృతిక వేడుకలు మన సంప్రదాయాలు, సంస్కృతి పట్ల విద్యార్థుల్లో అవగాహనను పెంపొందించడంతో పాటు, వారిలో ఐక్యత, స్నేహభావం, ఆనందాన్ని పెంచుతాయని తెలిపారు.లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి మాట్లాడుతూ, దాండియా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, ఆనందం, సాంప్రదాయ విలువలపట్ల ఆసక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. కుటుంబసభ్యులు, స్నేహితులు, విద్యార్థులు కలిసి ఈ వేడుకల్లో పాల్గొనడం ద్వారా కార్యక్రమం మరింత ప్రత్యేకంగా నిలిచిందని పేర్కొన్నారు.కార్యక్రమం చివర్లో నిర్వహించిన లక్కీడ్రా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో ఉ త్సాహంగా లక్కీ డ్రాలో పాల్గొని విజేతల ప్రకటన కోసం ఆసక్తిగా ఎదురుచూశారు. విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ వందన బోప్రే కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సాంస్కృతిక వైభవం, విద్యార్థుల ప్రతిభ, తల్లిదండ్రుల ఉత్సాహం, కుటుంబ అనుబంధం, భారతీయ సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలిచిన లక్ష్య దాండియా నైట్ అందరిమదిలో చిరస్మరణీయంగా నిలిచింది అనడం అతిశయోక్తి కాదు అని, అందరి సమిష్టి సహకారంతో దాండియా నైట్ వేడుకలు అత్యంత విజయవంతంగా, ఆనందోత్సాహాల మధ్య ముగిశాయని ఆమె పేర్కొన్నారు.

## ప్రభుత్వ తీరుకు నిరసనగా వీఆర్‌ఏలు మోకాళ్లపై నిరసన...



**గుడ్లవల్లేరు:అక్టోబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గ్రామ రెవిన్యూ సహాయకుల కోర్కెలు నెరవేర్చకుండా తాత్సారం చేస్తున్న ప్రభుత్వ వైఖరికి నిరసనగా శనివారం గుడ్లవల్లేరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మెలో వీఆర్‌ఏలు మోకాళ్లపై నిలబడి సమ్మె చేశారు. 25రోజులుగా సమ్మె చేస్తున్నా...పట్టించుకోని సర్కార్ మొండి తీరుకు నిరసనగా ఉద్యమాన్ని మరింత ఉధతం చేస్తామని వీఆర్‌ఏల సంఘ గుడ్లవల్లేరు మండల అధ్యక్షుడు ఉడుముల రవికుమార్, ఆ సంఘ నాయకులు చార్లెస్, కిరణ్, ఫైజుల్లా, ఆదర్శ్ హెచ్చరించారు.

## మానుకోట తాలూకాను జిల్లా చేసి అభివృద్ధికి పునాదులు వేసిన మహనీయుడు కేసీఆర్.

**భారత రాష్ట్ర సమితి పెద్దవంగర మండల అధ్యక్షులు ఈదురు ఐలయ్య.**

**జిల్లా ఆవిర్భవించి 10 సంవత్సరాలైనా సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం.**



**పెద్దవంగర అక్టోబర్ 10 (వార్తప్రభ):** మానుకోట తాలూకాను జిల్లాగా ఏర్పాటు చేసి ఉమ్మడి వరంగల్ జిల్లాలో అభివృద్ధి చెందిన జిల్లాగా ఏర్పాటు కావడంలో కెసిఆర్ కేటీఆర్ ఎర్రబెల్లి దయాకర్ రావు ల కృషి ఎనలేనిదని భారత రాష్ట్ర సమితి జిల్లా నాయకులు పెద్దవంగర పార్టీ మండల అధ్యక్షులు ఈదురు ఐలయ్య అన్నారు. శనివారం మహబూబాబాద్ జిల్లా ఆవిర్భవించి 10 సంవత్సరాలయిన సందర్భంగా జిల్లా కేంద్రంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతోపాటు అభివృద్ధి చెందాలని దృఢ సంకల్పంతో జిల్లాలను ఏర్పాటు చేసిన మహనీయుడు కేసీఆర్ అని కొనియాడారు. మానుకోట తాలూకాలో జిల్లాగా ఏర్పాటు చేసి అభివృద్ధికి పునాదులు వేసిన మహనీయుడు తెలంగాణ ప్రదాత కెసిఆర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు పెద్దవంగర మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామం లో వైభవోపేతంగా ప్రారంభమైన బతుకమ్మ ఉత్సవాలు







**శేరిలింగంపల్లి,అక్టోబర్ 10 (వార్తాప్రభ):**మాదాపూర్ శిల్పారామంలో నేటి నుండి బతుకమ్మ ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి.ఈ వేడుకల్లో భాగంగా శనివారం శిల్పారామ మహిళా సిబ్బంది రంగురంగుల పూలతో బతుకమ్మలను ఎంతో అందంగా తీర్చిదిద్దారు.వచ్చిన సందర్శకులతో కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు.?సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా, బెంగళూరు నుండి విచ్చేసిన పూర్ణిమ శిష్య బృందం ప్రదర్శించిన భరతనాట్యం ప్రేక్షకులను ఎంతగానో అలరించింది.అలాగే,సంధ్యారాణి కోసూరు శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనలో భాగంగా పుష్పాంజలి,సప్త మాత్రికా స్వరూపం,నవదుర్గ రూపం, అష్ట లక్ష్మి స్తోత్రం, కృష్ణ లీలలు వంటి ఆకట్టుకునే అంశాలను ప్రదర్శించారు.?ఈ ప్రదర్శనలో శ్రీనిక, ఇషితా, రుత్విక, మనస్విని,అనిష్క, ఆద్య సర్వాణి, జోషిత, ప్రణవి, శ్రీహంసిని, సమన్విత, ప్రవీణ్, ప్రశాంత్, కల్యాణి తదితర కళాకారులు పాల్గొని తమ ప్రదర్శనతో అందరినీ మంత్రముగ్ధులను చేశారు.

## పోలింగ్ స్టేషన్ల పరిశీలన...



**గుడ్లవల్లేరు:అక్టోబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక సంస్థల ఎన్నికలు వ ం ు ం చ ు కొ న వ ు న్న తరుణంలో మండలం లోని పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేస్తున్నారు. శ నివారం మండలంలోని డోకిపర్రు, పెదపాలెం వంటి పోలింగ్ కేంద్రాలను తన పోలీస్ సిబ్బందితో కలిసి గుడ్లవల్లేరు ఎస్.ఐ కొండపల్లి సురేష్‌బాబు పరిశీలించారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా వివాద రహితంగా ఎన్నికలను నిర్వహించేందుకు ప్రయత్నించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నామని ఎస్.ఐ సురేష్‌బాబు పేర్కొన్నారు.

## అమెరికన్ యూనివర్సిటీ చే ముండ్లమూరీ నాగూర్ రావు కు గౌరవ డాక్టరేట్




**శేరిలింగంపల్లి,అక్టోబర్ 10 (వార్తాప్రభ)::** నిరుపేదల సంక్షేమానికి విశేష సేవలందిస్తున్న మదీనాగూడ మై హోమ్ జువెల్ నివాసి ముండ్లమూరి నాగూర్‌రావుకు యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది.శనివారం చెన్నైలోని కృష్ణ గాన సభలో ఈ పురస్కారాన్ని అందజేశారు.నాగూర్‌రావు పేదలకు అన్నదానం, ఉచిత ఆరోగ్య పరీక్షలు,150 మందికి పైగా పేదలకు కంటి శుక్లాల శస్త్రచికిత్సలకు సహకారం, అనాథ విద్యార్థులకు విద్యా సహాయం, వృద్ధాశ్రమాలకు తోడ్పాటు అందిస్తున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ అందించడం ఆనందంగా ఉందన్నారు.ఈ పురస్కారాన్ని సమాజానికి అంకితం చేస్తున్నట్లు తెలిపారు. మానవ సేవే మాధవ సేవ అనే ఆశయంతో భవిష్యత్తులోనూ పేదలకు, అవసరంలో ఉన్నవారికి సేవలు కొనసాగిస్తానని పేర్కొన్నారు.

## వికెఆర్ కళాశాలలో విఎల్ఎస్ఐ పై గెస్ట్ లెక్చర్




గుడివాడ,అక్టోబర్ 10 (వార్తాప్రభ) : స్థానిక వి.కె.ఆర్ & వి.ఎన్.బి ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో గురువారం గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. "ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ అపర్చునిటీస్ ఇన్ లో-పవర్ వీఎల్ఎస్ఐ డిజైన్" అనే అంశంపై గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ టి.వెంకటలక్ష్మి విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. సెమీకండక్టర్ పరిశ్రమలో లో-పవర్ చిప్ డిజైన్ ప్రాముఖ్యత, మొబైల్, ఐఓటీ, వైద్య పరికరాల్లో వినియోగం, ఉద్యోగ అవకాశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమానికి ఈసీఈ విభాగాధిపతి డా.జి.మురళీకృష్ణ అధ్యక్షత వహించగా, ఈవెంట్ కోఆర్డినేటర్ కోడూరి దేవీ దేవి సమన్వయం చేశారు. ప్రిన్సిపాల్ డా. ఎస్.హెచ్.వి.ప్రసాదరావు మాట్లాడుతూ ఇటువంటి గెస్ట్ లెక్చర్లు విద్యార్థుల్లో పరిశ్రమకు తగ్గ నైపుణ్యాలను పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కళ్యాణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలపై అవగాహన సదస్సు



గుడివాడ,అక్టోబర్ 10 (వార్తాప్రభ) : అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్.పి.ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా, ఆడపిల్లల అభివృద్ధి కోసం వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో నెహ్రూ చౌక్ సెంటర్ లోని పాఠశాల ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, బాలికా విద్యా ప్రాధాన్యతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. శ్రీనివాసరావు, ఎంఎస్కే లు, వాసవ్య మహిళా మండలి దోనెల మార్తమ్మ, కమ్యూనిటీ సోషల్ వర్కర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గుడివాడలో కళాకారులకు పెన్షన్ పంపిణీ



గుడివాడ,అక్టోబర్ 10 (వార్తాప్రభ) : పట్టణ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో 24 మంది కళాకారులకు జీవితకాల పెన్షన్ కింద నెలవారీ ఆర్థిక సాయం అందజేశారు. ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున మొత్తం రూ.24 వేలను పంపిణీ చేశారు. సంఘ గౌరవ అధ్యక్షుడు నెరుసు చింతయ్య, అధ్యక్షుడు కొడాలి రాజా, మట్టా రాజా, యార్లగడ్డ సత్యనారాయణ తదితర 24 మంది దాతలు ఈ మొత్తాన్ని స్పాన్సర్ చేశారు. లబ్ధిదారుల్లో క్లారినెట్ కృష్ణ, హార్మోనిస్టులు చంద్రం, రాములు, డోలక్ కళాకారులు రామకృష్ణ, నరసింహారావు, గాయకుడు సుబ్రహ్మణ్యం, మేకప్ గోవింద్ తదితరులు ఉన్నారు.

## మానవతా వారి అధ్వర్యంలో అన్నదానం



గుడివాడ,అక్టోబర్ 10 (వార్తాప్రభ) : శనివారం మధ్యాహ్నం మానవతా ఆఫీస్ లో మానవతా డైరెక్టర్ దండమూడి సీతారామ స్వామి, ఉమ్మడి కృష్ణాజిల్లా పర్యావరణ పరిరక్షణ చైర్మన్ దండమూడి జయలక్ష్మి దంపతులు వారి తల్లిదండ్రులు దండమూడి గోపాలకృష్ణయ్య, సంపూర్ణమ్మ దంపతులు మరియు వారి కుమారుడు మురళీ కృష్ణ ల జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దండమూడి సీతారామ స్వామి దంపతులు, అధ్యక్షురాలు నందమూరి పద్మజ, కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ కోశాధికారి బచ్చు రాధాకృష్ణ, కార్యవర్గసభ్యులు మరడాని వెంకటేశ్వరరావు, సామి రామమోహనరావు, ఉమాదేవి, హైమవతి దంపతులు, ఇంకా అనేక మంది పేదలు, మానవతాసభ్యులు హాజరయ్యి భోజనాలు చేశారు.

## గాయపడిన పెయింటర్‌కు ఆర్థిక సాయం



గుడివాడ,అక్టోబర్ 10 (వార్తాప్రభ) : ప్రమాదంలో గాయపడిన పెయింటర్ కుటుంబానికి ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ అండగా నిలిచింది.నైజాంపేట డో.నెం. 1-314 కు చెందిన మహమ్మద్ సమ్మద్ గుడివాడ ఆటోనగర్ లో పెయింటర్ గా పనిచేస్తున్నాడు. శుక్రవారం పని ముగించుకుని సైకిల్ పై ఇంటికి వెళుతుండగా కిందపడటంతో ఎడమ మోచేయి విరిగింది. దీంతో గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బాధితునికి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు తమ్మిశెట్టి లక్ష్మణరావు, అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దుస్, నాయకులు కాజా మొహిద్దీన్, రహ్మాన్, ముజీబ్, పార్థసారథి, మొహిద్దీన్ భాష, నాగరాజు లు పాల్గొన్నారు.

# గుడివాడ ఆధ్యాత్మిక ప్రాధాన్యతను పెంపొందించేలా ఉత్సవాలు సమన్వయంతో నిర్వహించాలి..

● రాజేంద్రనగర్ స్వగృహంలో దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీలతో ఎమ్మెల్యే రాము సమావేశం.. నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, భక్తుల సౌకర్యాలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలపై చర్చ..



గుడివాడ,అక్టోబర్ 10 (వార్తాప్రభ) : ఈ నెల 11వ తేదీ ఆదివారం నుంచి వివిధ ఆలయాల్లో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, రాజేంద్రనగర్‌లోని తన స్వగృహంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దేవాదాయ శాఖ అధికారులతో పాటు వివిధ ఆలయాల కమిటీల చైర్మన్లు, సభ్యులతో సమావేశమయ్యారు. నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఆలయాల్లో చేపట్టనున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల నవరాత్రి ఉత్సవాల బుక్లెట్లను ఎమ్మెల్యే రాము ఆవిష్కరించారు. నవరాత్రుల సందర్భంగా నిర్వహించనున్న ప్రత్యేక పూజలు, అమ్మవారి అలంకరణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సాంస్కృతిక వేడుకల వివరాలను ఆలయ కమిటీల ప్రతినిధులు, దేవాదాయ శాఖ అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. నవరాత్రి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలే కాకుండా మన సంప్రదాయాలు, సంస్కృతి, భక్తిభావాన్ని ప్రతిబింబించే పవిత్ర సందర్భాలని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. ఆలయ కమిటీలు, దేవాదాయ శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ టిడిపి అధ్యక్షుడు పండ్రాజు సాంబశివరావు, దేవాదాయ శాఖ ఈవో కందుల గోపాలరావు, శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థాన ధర్మకర్తల కమిటీ చైర్మన్ పట్టపు చిన్న, శ్రీ గౌరీ శంకర స్వామి వారి దేవస్థానం చైర్మన్ లోయ బోస్, శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థాన చైర్మన్ అంగడాల సతీష్, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ లింగం చిట్టిబాబు, వేద పండితులు లంక విజయ్ సాయి చంద్, లంకా జితేంద్ర, ఆయా ఆలయాల కమిటీల సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడలో అభివృద్ధి పనులు వేగవంతం..

● రూ.5.80 కోట్లతో 16 సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే రాము శంకుస్థాపన



గుడివాడ,అక్టోబర్ 10 (వార్తాప్రభ) : పట్టణంలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని ప్రధాన ప్రాంతాలతో పాటు దశాబ్దాలుగా కనీస మౌలిక వసతులకు నోచుకోని శివారు కాలనీల అభివృద్ధిపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలకు అవసరమైన రహదారులు, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని 26, 29, 30వ వార్డుల్లో మొత్తం రూ.5.80 కోట్ల అంచనా వ్యయంతో 16 సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రాము శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రాము స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాయినగర్‌లో విద్యుత్ స్తంభాలకు సంబంధించిన సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా, సమస్యను పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టడంతో పాటు బుధవారం నాటికి తనకు నివేదిక అందించాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, జనసేన ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, పట్టణ టిడిపి అధ్యక్షులు పండ్రాజు సాంబశివరావు, టిడిపి నాయకులు గోర్జి సత్యనారాయణ, లింగం ప్రసాద్, బొంబాయి శ్రీను, చేకూరి జగన్మోహన్రావు, కార్పొరేషన్ డైరెక్టర్లు దింట్యాల రాంబాబు, మజ్జాడ నాగరాజు, మున్సిపల్ ఎం.ఈ. సతీష్ చంద్ర, డి.ఈ శివాజీ, ఏ.ఈ లు శ్రావణ్ కుమార్, సత్యనారాయణ మరియు కూటమి నాయకులు, మున్సిపల్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తిరువూరు టీడీపీలో బీసీ ఎజెండా వెనుక రాజకీయ వ్యూహం?

● బీసీ నాయకత్వానికి ప్రాధాన్యమా.. స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించే ప్రయత్నమా?



తిరువూరు,అక్టోబర్ 10 (వార్తాప్రభ) : తిరువూరు 175 నియోజకవర్గాలలో ఎక్కడా లేని విధంగాఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు బీసీ ఎజెండాతో ముందుకు సాగడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారుతోంది. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన బీసీ సమావేశం వెనుక సామాజిక న్యాయం ప్రధాన లక్ష్యమా? లేక రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయంగా తన స్థానాన్ని బలోపేతం చేసుకునే వ్యూహమా? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

**బీసీ ఎజెండాతో అధిష్ఠానానికి సంకేతాలా?..**

ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ప్రభుత్వం బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే విధానాలకు అనుగుణంగా ఎమ్మెల్యే తన కార్యక్రమాలను విస్తరిస్తు న్నారా? బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించడం ద్వారా నియోజకవర్గంలో క్షేత్రస్థాయి పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పించాలనుకుంటున్నారా? అనే చర్చ సాగుతోంది. తిరువూరులో నిర్వహించిన 'జయహో బీసీ' కార్యక్రమంలోనూ బీసీ రాజకీయ ప్రాతినిధ్యం, స్థానిక నాయకత్వాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలను ఎమ్మెల్యే దూకుడు పెంచారు

**ఎంపీ వర్గంతో అంతర్గత రాజకీయాల ప్రభావం ఉందా?..**

మరోవైపు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌తో ఎమ్మెల్యేకు గతంలో విభేదాలు బహిరంగంగా విశ్లేషిస్తున్నారు. తనకు వ్యతిరేకంగా ఉన్న వర్గం బీసీల సమస్యలపై తగినంతగా గళం వినిపించలేదనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నమా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే, ఎంపీ వర్గం బీసీల కోసం ఇప్పటివరకు ఎటువంటి కార్యక్రమం నిర్వహించ పోవడంతో ఎమ్మెల్యే బీసీలకు దగ్గర అవుతూ పూర్తిగా తిరువూరు రాజకీయాలను తన చుట్టూ తిప్పుకుంటున్నాడు ముఖ్యంగా తిరువూరు మున్సిపాలిటీ బీసీలకు కేటాయించి బీసీ అభ్యర్థిని చైర్మన్ చేసి తన రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకొని ప్రత్యర్థ వర్గానికి ప్రాధాన్యత తగ్గించాలని వ్యూహం తిరువూరు మున్సిపాలిటీ ఓసి అయిన అధిష్టానం అండదండలతో బీసీ కాండేట్ని చైర్మన్ నిలబెట్టాలని ఎమ్మెల్యే రాజకీయ వ్యూహం అదే జరిగితే నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా ఎమ్మెల్యే తన చక్రాన్ని తిప్పుతాడని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు

# ఎల్‌నినో ప్రభావంపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష



హైదరాబాద్, అక్టోబర్ 10 (వార్తాప్రభ) : ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని, దీన్ని అధిగమించేందుకు వెంటనే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ రుతుపవనాలు ప్రవేశించే వరకు సాగు, తాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రణాళిక ఉండాలని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన సీనియర్ అధికారులతో ఎల్‌నినో ప్రభావంపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో తీవ్రమైన సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. నీటిని, విద్యుత్‌ను చాలా పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మార్కెట్లో విద్యుత్ అందుబాటులో లేదని, అందువల్ల విద్యుత్‌పై ఆధారపడిన పనులను తాత్కాలికంగా వాయిదా వేసుకోవడం మంచిదని సూచించారు. నీటి వృథాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, ఒక్క నీటిబొట్టు కూడా వృథా కాకుండా చూడాలని స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మీడియా, సినిమా, సోషల్ మీడియా ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.

## ఫ్రెషర్స్ డేలో విద్యార్థినికి ఆర్థిక సాయం



గన్నవరం,అక్టోబర్ 10 (వార్తాప్రభ) : గన్నవరం పట్టణంలోని శ్రీ శ్రీనివాస గ్రావిటీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్ ఫెడరేషన్ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి చిల్లర రాజేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న ఎన్. సౌందర్యకు ఆర్థిక సాయం అందజేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి, భవిష్యత్తుకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సహాయం అందించినట్లు తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించడం ద్వారా తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## లక్ష్య లోగిలిలో దాండియా వేడుకలు..



కాకినాడ,అక్టోబర్ 10 (వార్తాప్రభ) : లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో "లక్ష్య ఫ్యామిలీ దాండియా నైట్ 2026" వేడుకలను అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో శుక్రవారం అనగా అక్టోబర్ 9వ తారీఖున ఘనంగా నిర్వహించారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డా.నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ డా. నల్లమిల్లి సుగుణా రెడ్డి, ప్రిన్సిపల్ వందన బోహ్రా ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. రంగురంగుల అలంకరణలు, ఆకట్టుకునే లైటింగ్, సంగీతం, నృత్య ప్రదర్శనలతో 'లక్ష్య' ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రతి కార్యక్రమంలోనూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని, వేడుకలను విజయవంతం చేయడంలో తమవంతు సహకారం అందించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాల వైభవాన్ని ప్రతిబింబించేలా బతుకమ్మ, గరగలు, కాళికామాత వంటి ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన దాండియా నృత్య వేడుకలు ప్రారంభించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ఉత్సాహంగా దాండియా ఆడుతూ వేడుకలకు మరింత శోభను తీసుకువచ్చారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతిఒక్కరూ దాండియా నృత్యంలో ఉత్సాహంగా పాల్గొనడంతో ప్రాంగణమంతా సంగీతం, నృత్యాలు, ఆనందోత్సాహాలతో మార్మోగింది. వేడుకల్లో భాగంగా నిర్వహించిన రావణ దహన కార్యక్రమం చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం లక్ష్య పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు చేసిన ధునుచి నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ చైర్మన్ డా. నల్లమిల్లి శేషారెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ఆత్మీయంగా మాట్లాడారు. చదువుతో పాటు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు. దాండియా వంటి సాంస్కృతిక వేడుకలు మన సంప్రదాయాలు, సంస్కృతి పట్ల విద్యార్థుల్లో అవగాహనను పెంపొందించడంతో పాటు, వారిలో ఐక్యత, స్నేహభావం, ఆనందాన్ని పెంచుతాయని తెలిపారు.లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి మాట్లాడుతూ, దాండియా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, ఆనందం, సాంప్రదాయ విలువలపట్ల ఆసక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. కుటుంబసభ్యులు, స్నేహితులు, విద్యార్థులు కలిసి ఈ వేడుకల్లో పాల్గొనడం ద్వారా కార్యక్రమం మరింత ప్రత్యేకంగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమం చివర్లో నిర్వహించిన లక్కీడ్రా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో ఉ త్సాహంగా లక్కీ డ్రాలో పాల్గొని విజేతల ప్రకటన కోసం ఆసక్తిగా ఎదురుచూశారు. విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ వందన బోహ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సాంస్కృతిక వైభవం, విద్యార్థుల ప్రతిభ, తల్లిదండ్రుల ఉత్సాహం, కుటుంబ అనుబంధం, భారతీయ సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలిచిన లక్ష్య దాండియా నైట్ అందరిమదిలో చిరస్మరణీయంగా నిలిచింది అనడం అతిశయోక్తి కాదు అని, అందరి సమిష్టి సహకారంతో దాండియా నైట్ వేడుకలు అత్యంత విజయవంతంగా, ఆనందోత్సాహాల మధ్య ముగిశాయని ఆమె పేర్కొన్నారు.

# బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది..

–ఆర్టీసీ చైర్మన్, మాజీ పార్లమెంటు సభ్యులు కొనకళ్ళ నారాయణరావు......



మచిలీపట్నం,అక్టోబర్ 10 (వార్తాప్రభ) : ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నందు 18 సంవత్సరాలు పైబడిన బ్రాహ్మణ మహిళలు, పురుషులు సభ్యులుగా చేరి బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నందలి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ చైర్మన్, మాజీ పార్లమెంటు సభ్యులు, కొనకళ్ళ నారాయణరావు బ్రాహ్మణులకు పిలుపునిచ్చారు...... ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ పథకాలను వివరించే నూతన కరపత్రాలను శనివారం బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ తో పాటుగా రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, మాజీ పార్లమెంటు సభ్యులు, కొనకళ్ళ నారాయణరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, కొనకళ్ళ జగన్నాధరావు (బుల్లయ్య) పురోహిత సంఘం నాయకులు, అంబటి పూడి మల్లికార్జున శాస్త్రి లు ఆర్టీసీ చైర్మన్, మాజీ పార్లమెంటు సభ్యుడు, కొనకళ్ళ నారాయణరావు కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, మాజీ పార్లమెంటు సభ్యులు, కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ..... రాష్ట్రంలో బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమం కోసం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది అన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నందు 600 రూపాయలతో సభ్యులుగా చేరితే ఎన్నో రకాల ఉపయోగాలు ఉన్నాయి అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో గతంలో లేని విధంగా 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల సభ్యులకు ఏదైనా కారణము వలన మరణం సంభవించిన ఎడల (సహజ మరణంతో సహా) 50వేల రూపాయలు ఎటువంటి ప్రీమియం వసూలు చేయకుండా ఉచిత ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించడం జరిగింది అని, చనిపోయిన వారి నామినీ లు క్రెడిట్ సొసైటీ బ్రాం చి నందు చనిపోయిన వారి డెత్ సర్టిఫికెట్, సభ్యత్వ కార్డు ప్రొడ్యూస్ చేసిన వెంటనే సొమ్ము అందజేయడం జరుగుతుంది అన్నారు. బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో సభ్యులుగా ఉన్నవారికి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలు ఆర్థికంగా బలపడేందుకు అరుంధతి సూక్ష్మ రుణ పథకం, వశిష్ట సూక్ష్మ రుణ పథకం, పురోహిత మిత్ర పథకం, బ్రాహ్మణ ఎంప్లాయిస్ కొరకు పర్సనల్ లోన్స్ సౌకర్యం, ఉన్నత విద్యా రుణాలు ఇలా అనేక రకాల పథకాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవచ్చు అని తెలిపారు. బ్రాహ్మణులకు ప్రతి ఎండోమెంట్ దేవాలయంలోనూ అర్చకులతో పాటు ఒక బ్రాహ్మణుడిని ట్రస్ట్ బోర్డులో నియమించి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం దేవాలయాలకు ఎంతో గుర్తింపు తెచ్చింది అన్నారు. అర్చకుల జీతాలు పెంచిన ఘనత చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానిదే నని అన్నారు. బ్రాహ్మణులకు ఏ సమస్య వచ్చినా ఎల్లప్పుడూ అండగా ఉండి ఆ సమ-స్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని కొనకళ్ళ నారాయణరావు తెలిపారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ మాట్లాడుతూ..... బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్, కె. బుచ్చి రాంప్రసాద్ నాయకత్వంలో గతంలో లేని విధంగా బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా చనిపోయిన నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలను ఆదుకోవాలి అనేటటువంటి సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో 600 రూపాయలతో సభ్యులుగా చేరిన 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల లోపు వారు సహజ మరణం చెందిన వారికి 50 వేల రూపాయలు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించి చనిపోయిన వారి నామినీలకు అందజేయడం ఎంతో గొప్ప విషయం అన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలసౌరి, ఆర్టీసీ చైర్మన్, కొనకళ్ళ నారాయణరావు, కూటమి ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో జిల్లాలోని బ్రాహ్మణులకు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా విశేష సేవలు అందిస్తూ, నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు ఆర్థికంగా భరోసా కల్పించడం జరుగుతోంది అని పి. వి.ఫణి కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నూతన కరపత్రాలను ఆవిష్కరించిన ఆర్టీసీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు, కొనకళ్ళ నారాయణరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, కొనకళ్ళ జగన్నాధ రావు (బుల్లయ్య) లకు బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ కృతజ్ఞతలు తెలిపారు

# మన పూర్వీకులను, తల్లిదండ్రులను మర్చిపోవద్దు - బి.సి.నేత బేరి రామచందర్ యాదవ్



**హైదరాబాద్,అక్టోబర్ 10 (వార్తాప్రభ) :** శేరిలింగంపల్లి నియోజక వర్గం, గచ్చిబౌలి నల్లగండ్ల, నేతాజీ నగర్ కాలనీలో బేరి రామచందర్ యాదవ్ నివాసంలో పెత్తర్ల అమావాస్య సందర్భంగా పెద్దలకు పితృదేవతలకు పూజించారు. మన పెద్దలు తాతలు, ముత్తాతలు, తల్లిదండ్రులు మరియు అత్తమామలు మనవాళ్లు స్వర్గస్తులైన వారికి పూజించుకోవడం మన బాధ్యత మన కర్తవ్యం వారి వల్లనే మనం ఈ లోకానికి వచ్చినాము వారిని గౌరవిస్తూ వారిని పూజిస్తూ ప్రతిరోజు భగవంతుని కంటే ముందు మన మనని కన్నా తల్లిదండ్రులను పూజించాలి వారిని గౌరవించాలి అదే మన ధర్మం మన పూర్వీకులను మనము ఎప్పుడూ మర్చిపోకూడదు . సనాతన ధర్మంలో మన అమ్మానాన్నలను మన పూర్వీకులను పూజిస్తూ వారి యొక్క ఆశీర్వాదాలను మనము పొందాలి రాబోయే తరాలకు మన పెద్దలు పాటించిన ఆచారాలను సంప్రదాయాలను కుటుంబాలను అమ్మానాన్న అన్నదమ్ములు తాత ముత్తాతలు మన బంధువులను కుటుంబ సభ్యులను ఐక్యమత్యంతో ఉండాలని ఒకరినొకరు గౌరవించుకోవాలని మన భారతదేశంలో సనాతన ధర్మంలో రామాయణం తండ్రి మాట జవదాటని శ్రీరామచంద్రుడు ధర్మం కోసం యుద్ధం చేసిన శ్రీకృష్ణుడు వారిని ఆదర్శంగా తీసుకొని మన బంధాలను బంధుత్వాలను గౌరవిద్దామనీ పెత్తర్ల అమావాస్య సందర్భంగా బి.సి.నేత, బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ సమాజానికి విజ్ఞప్తి చేశారు.

# నేడు బాలా త్రిపుర సుందరీదేవిగా దర్శనమివ్వనున్న కొండలమ్మ...



**గుడ్లవల్లేరు,అక్టోబర్ 10 (వార్తాప్రభ) :** దసరా నవరాత్రుల్ని పురస్కరించుకుని మండలంలోని వేమవరంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారు ఆదివారం భక్తులకు త్రిపుర సుందరీదేవిగా దర్శనమివ్వనున్నారు. ఈ విషయాన్ని ఆ దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు(మోహన్), ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తలు శనివారం విలేకరులకు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యము కలగకుండా దేవస్థానంలో శానిటేషన్, త్రాగు నీరు, ప్రసాదం ఏర్పాటు చేయిటమైనదని చెప్పారు.

**కొండలమ్మకు ఎమ్మెల్యే రాము పట్టు వస్త్రాలు...** గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముచే ఆదివారం ఉత్సవాలకు కలశ స్థాపన కార్యక్రమం జరుగునని చైర్మన్ మోహన్, ఈఓ కొండలరావు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఎమ్మెల్యే రాము నూతన పట్టు వస్త్రములు సమర్పించనున్నారని చెప్పారు. తొలుత అమ్మవారి సన్నిధిలో గణపతిపూజ, పుణ్యహవాచన, పీఠార్చన, దీక్షాధారణ, సహస్ర నామార్చన, అగ్ని ప్రతిష్టాపన, సమస్త కార్యజయమునకు, నవగ్రహ దోష పరిహారమునకు, శ్రీ లక్ష్మీ గణపతి సహిత నవగ్రహ హవనములు, శ్రీ అమ్మవారి మూలమంత్ర హవనములు చేపట్టనున్నట్లు చెప్పారు. అమ్మవారి సన్నిధిలో భజన, కూచిపూడి నత్య ప్రదర్శన, పౌరాణిక నాటకం వంటి సాంస్కతిక కార్యక్రమములు జరుగునని తెలిపారు. అమ్మవారికి ఊంజల్ సేవ, పంచ హారతులు, మంత్ర పుష్పములు, చతుర్వేదస్వస్తి జరుగునని ఈఓ కొండలరావు, చైర్మన్ మోహన్, ధర్మకర్తలు పేర్కొన్నారు.

**ఎమ్మెల్యే రాముచే ప్రారంభం...** కొండలమ్మ సన్నిధిలో రూ.కోటితో కాలక్షేప మండపాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని ఆదివారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఆ దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. నిర్మించిన ఆ భవన ప్రారంభ ఏర్పాట్లను చైర్మన్ మోహన్‌తో పాటు ధర్మకర్తలు కళ్ళేపల్లి సుగుణ శేఖర్, వడ్లమూడి రవీంద్రబాబు, మన్నెం వీర నాగేంద్రరావు, ముంగం ఆంజనేయులు, నూతులపాటి లక్ష్మీ పావని, పెన్నేరు వీర వెంకట నాగ లీల శేఖర్ పరిశీలించారు.

# అక్టోబర్ 11న సెంటినీ డా. శ్రీమన్నారాయణ హాస్పిటల్ ప్రారంభం

**• 150 పడకలతో అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు**







**విజయవాడ,అక్టోబర్ 10 (వార్తాప్రభ) :** ఆధునిక వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా సెంటినీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మూడవ ఆసుపత్రిగా సెంటినీ డా. శ్రీమన్నా రాయణ హాస్పిటల్‌ను అక్టోబర్ 11న ప్రారంభించనున్నట్లు గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మొవ్వ పద్మ తెలిపారు. నగర ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న సెంటినీ గ్రూప్, వైద్య రంగంలో రెండు దశాబ్దాలకు పైగా విశేష అనుభవం కలిగిన నిపుణుల నేతృత్వంలో 150 పడకల సామర్థ్యంతో ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని తాడేపల్లిలో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. శనివారం విజయ-వాడలోని ఎం.జి. రోడ్డులో ఉన్న హోటల్ ఫార్చ్యూన్ మురళిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె ఆసుపత్రి ప్రత్యేకతలను వివరించారు. సెంటినీ హాస్పిటల్స్ గ్రూప్ ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ జె.శ్రీమన్నారాయణ, ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ అండ్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ ఎన్.జగదీష్, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ లావు హరీష్, జనరల్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ తుళ్లూరి రేష్మా చౌదరి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎన.మాధురి, మరియు రేడియాలజీ నిపుణులు డాక్టర్ సుషేన్‌లను ప్రమోటర్లుగా భాగస్వాములుగా కలిసి సెంటినీ డాక్టర్ శ్రీమన్నారాయణ హాస్పిటల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. హాస్పిటల్ ప్రత్యేకతలను గురించి వివరిస్తూ అత్యాధునిక వైద్య పరికరాలు, ఆధునిక సదుపాయాలతో 150 పడకల హాస్పిటల్‌గా తీర్చిదిద్దామని తెలిపారు. ప్రమోటర్లైన డాక్టర్లు టీం మాట్లాడుతూ, ఈ పరిసర ప్రాంత ప్రజలకు చుట్టుపక్కల జిల్లాల వారికి అత్యుత్తమ వైద్యం అందించడమే తమ ధ్యేయం అని అందుకు కట్టుబడి ఉంటామన్నారు. ఏ ఐ ఆధారిత వైద్యం అందించడం ఇక్కడ ప్రత్యేకతగా తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్యులను డైరెక్టర్లుగా, ప్రమోటర్లుగా భాగస్వామ్యం చేస్తూ అత్యాధునిక వైద్య పరికరాలు, ఆధునిక సదుపాయాలతో ఈ ఆసుపత్రిని తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఆసుపత్రిలో కార్డియాలజీ విభాగంలో విశేష అనుభవం కలిగిన డాక్టర్ జె. శ్రీమన్నారాయణ, ట్రామా కేర్, జాయింట్ రీప్లేస్‌మెంట్, రోబోటిక్ చికిత్సల్లో నైపుణ్యం కలిగిన డాక్టర్ ఎన్. జగదీష్, న్యూరాలజీ విభాగంలో అనుభవజ్ఞులైన డాక్టర్ లావు హరీష్, జనరల్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ తుళ్లూరి రేష్మ చౌదరి, డాక్టర్ సుషేన్, రేడియాలజిస్ట్ డాక్టర్ ఎన్. మాధురితో పాటు ప్రసూతి, గైనకాలజీ తదితర విభాగాలకు చెందిన వైద్యులు సేవలందించను న్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మొవ్వ పద్మ మాట్లాడుతూ, నవ్యాంధ్ర రాజధాని ప్రాంతమైన తాడేపల్లి--అమరావతిలో అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన సెంటినీ డా. శ్రీమన్నారాయణ హాస్పిటల్ వైద్య రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందేలా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఆధునిక వైద్య సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గుండె, నాడీ వ్యవస్థ, మోకాళ్ల సమస్యలు, జీర్ణకోశం, శ్వాసకోశం, మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధులతో ఆసుపత్రికి వచ్చే రోగులకు సమగ్ర వైద్య సేవలు అందించడంతో పాటు, వారు కోలుకునే వరకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బాధ్యతతో, నిబద్ధతతో సేవలందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రతి రోగికి మెరుగైన చికిత్స, తగిన వైద్య పర్యవేక్షణ అందించడమే సెంటినీ గ్రూప్ ఆశయమని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఆసుపత్రి చైర్మన్ మొవ్వ ఆనంద్, డైరెక్టర్ మొవ్వ విష్ణు, ఆసుపత్రి సీఈఓ సి.ఎల్.ఎన్. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 5న కైట్ ఆధ్వర్యంలో ఏఐ ఫ్యూజన్ సమ్మిట్




**కాకినాడ, అక్టోబర్ 10 (వార్తాప్రభ) :** కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతపై అవగాహన పెంపొందించడంతోపాటు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో కాకినాడలో నవంబర్ 5న రెండో విడత ఏఐ ఫ్యూజన్ సమ్మిట్--2026 పేరుతో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, ఏపీడీటీఐ నెట్‌వర్క్ చైర్మన్ శ్రీధర్ కొసరాజు తెలిపారు. కాకినాడలోని ఫ్యాబియన్ కన్వెన్షన్ సెంటర్ (గోదావరి కళాక్షేత్రం)లో ఈ సదస్సు జరగనుందని వెల్లడించారు. డీప్‌టెక్ నాగపూర్ణ ఫౌండేషన్ (డీటీఎన్ఎఫ్), ఏపీడీటీఐ నెట్‌వర్క్, టాలెంట్ ఏపీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీధర్ తెలిపారు. కైట్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సదస్సు వివరాలను ఆయన స్థానికంగా విలేకరులకు వెల్లడించారు. ఈ సందర్భంగా శ్రీధర్ కొసరాజు మాట్లాడుతూ గత ఏడాది నిర్వహించిన తొలి సదస్సుకు విశేష స్పందన లభించిందని, గోదావరి ప్రాంతానికి చెందిన పలువురు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగావకాశాలు లభించాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఏడాది సదస్సుకు గూగుల్, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, బాష్, టీసీఎస్ వంటి ప్రముఖ సంస్థలకు చెందిన ఏఐ నిపుణులు హాజరై తమ అనుభవాలను పంచుకోనున్నట్లు తెలిపారు. ఏజెంటిక్ ఏఐ, ఏఐ మోడళ్లు, ఫిజికల్ ఏఐ, భవిష్యత్తులో ఉద్యోగ రంగంలో చోటుచేసుకోనున్న మార్పులు, ఆవిష్కర్తలకు ఏఐ వినియోగం వంటి అంశాలపై చర్చలు నిర్వహించ నున్నారు. ఈ సదస్సుకు వెయ్యి మందికిపైగా సీఈఓలు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, స్టార్టప్ ప్రతినిధులు, విద్యార్థులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఏఐ సాంకేతికతను మరింత విస్తృతంగా ప్రజలకు చేరువ చేయడంతోపాటు, ప్రాంతీయ స్థాయిలో నూతన ఆవిష్కరణల అభివృద్ధికి ఈ సదస్సు దోహదపడుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కైట్ కళాశాల యాజమాన్యం పర్యవేక్షణలో కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీధర్ తెలిపారు. ఈ సమావేశంలో డేటా ఐ2ఐ సీఈఓ టి తిరుమలేష్, కైట్ కళాశాల డైరెక్టర్ సురేఖ రావిపాటి, క్రిఫీ సాఫ్ట్‌వేర్ సీఈఓ కొవ్వూరి కృష్ణారెడ్డి, కైట్ కళాశాల ప్రిన్సిపల్ వై రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కవులూరులో పశువుల ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన

**•రూ.35 లక్షలతో నిర్మించనున్న ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్**



**జి.కొండూరు,అక్టోబర్ 10 (వార్తాప్రభ) :** మండలంలోని కవులూరు గ్రామం లో పశువుల ఆస్పత్రి భవన నిర్మాణానికి మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శనివారం రాత్రి శంకుస్థాపన చేశారు. ఈ భవనం నిర్మాణానికి డి.ఎం.ఎఫ్ నిధులు రూ. 35 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. పశువైద్య సేవలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా పశుపోషకులకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు,స్థానిక ప్రజాప్రతినిధులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# గత వైసిపి పాలకులు అభివృద్ధిని గాలికి వదిలేశారు-ఎమ్మెల్యే బోడె



**కంకిపాడు, అక్టోబర్ 10 (వార్తాప్రభ) :** ఐదేళ్ల పాలనలో గ్రామాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారు.. ఇప్పుడు అభివృద్ధి పనులు చేపడుతుంటే వైసీపీ నేతలకు ఎందుకంత అసహనం అని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు గ్రామంతో పాటు గోసాల, చిన్నవోగిరాల, పెద్దవోగిరాల గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సుమారు రూ. 1.60 నిధులతో రోడ్లు మరియు డ్రైనేజీ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వై వి బి రాజేంద్రప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో పేరుకుపోయిన మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ రహదారులు, డ్రైనేజీల అభివృద్ధికి నిధులు కేటాయిస్తుంటే, అభివృద్ధిని చూసి ఓర్వలేని వైసీపీ నాయకులు విమర్శలకే పరిమితమవుతున్నారని వ్యాఖ్యానించారు. 2014--2019 మధ్య ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కంకిపాడు ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం కోసం రూ. 3.20 కోట్ల నిధులు కేటాయించి టెండర్లు పిలిచామని గుర్తుచేశారు. ఎన్నికల నేపథ్యంలో పనులు నిలిచిపోయి నిధులు రద్దు కావడంతో ఆ సమస్య పరిష్కారం కాలేదని వివరించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కూడా ఈ ప్రధాన సమస్య పరిష్కారానికి అవసరమైన నిధులు కేటాయించలేదని విమర్శించారు. ఐదేళ్ల పాలనలో గ్రామాల అభివృద్ధిపై తగిన శ్రద్ధ చూపకుండా ఇప్పుడు అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ ప్రజలకు అవసరమైన పనులను దశలవారీగా చేపడుతున్నామని చెప్పారు. వైసీపీ నాయకులు రాజకీయ విమర్శలు చేయడం మానుకొని, గతంలో తమ పాలనలో పరిష్కరించలేని సమస్యలపై ప్రజలకు సమాధానం చెప్పాలని సూచించారు. ప్రజలకు కావాల్సింది మాటల యుద్ధాలు కాదని, నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారమని స్పష్టం చేశారు. కంకిపాడు ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం చేపట్టి రాబోయే రెండేళ్లలో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. రాజకీయాల్లో బెదిరింపులు, దౌర్జన్యాలకు తావు లేదని స్పష్టం చేశారు. కత్తులు, కటారులతో భయపెట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ఎన్నికల్లో ప్రజల మద్దతుతోనే గెలవాలన్నది తమ విధానమని తెలిపారు. తమ పార్టీకి చెందిన వారు తప్పు చేసినా సమర్థించబోమని, తప్పును సరిదిద్దుకునేలా సూచిస్తామని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల అమలు, పారదర్శక పాలన దిశగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కోడిపందాలపై పోలీసుల దాడి

**చిల్లకల్లు,అక్టోబర్ 10 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామ పరిధిలోని వేదాద్రి రోడ్డులో కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ టి. సూర్య శ్రీనివాస్ సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని, ఒక కోడి, రెండు కత్తులు, రూ.780 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేశారు.

# పట్టిసీమ ఫలం.. సీఎం చంద్రబాబుకు కృష్ణా డెల్టా రైతుల కృతజ్ఞతలు



**విజయవాడ,అక్టోబర్ 10 (వార్తాప్రభ) :** పట్టిసీమ ఎత్తి పోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు జల భరోసా కల్పిం చిన ముఖ్యమంత్రి చంద్రబా బు నాయుడికి డెల్టా రైతులు, సాగునీటి సంఘాల ప్రతిని ధులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సచివాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి సీఎంను కలిసిన రైతులు.. ఆయనను శాలువాతో సత్కరి ంచి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. చంద్రబా బును 'ఏపీ వాటర్ మ్యాన్'గా, 'జలప్రదాత'గా అభివర్ణిస్తూ ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పట్టిసీమ ద్వారా గోదావరి వరద నీటిని కృష్ణా డెల్టాకు తరలించి, రాయలసీమకు అందించి అన్ని ప్రాంతాలకు న్యాయం చేశారని కొనియాడారు.

# మున్సిపల్ ఎన్నికల వేడి.. జగ్గయ్యపేటలో చైర్మన్ పీఠంపై ఉత్కంఠ!

**● ఓసీనా? బీసీనా? మహిళకు రిజర్వ్ అవుతుందా? ● కూటమి నుంచి ఎవరు? వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎవరు?**

వార్తాప్రభ రాజకీయ విశ్లేషణ



**జగ్గయ్యపేట,అక్టోబర్ 10 (వార్తాప్రభ) :** జగ్గయ్యపేట మున్సిపాలిటీలో రాబోయే ఎన్నికల నేపథ్యంలో రాజకీయ చర్చలు ఊపందుకుంటున్నాయి. చైర్మన్ పీఠం ఎవరికి దక్కుతుంది? ఏ పార్టీ నుంచి అభ్యర్థి బరిలోకి దిగుతారు? రిజర్వేషన్లు ఏ విధంగా ఖరారు కానున్నాయి? అనే అంశాలు పట్టణ రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

**చైర్మన్ పీఠం ఓసీకా.. బీసీకా?..** మున్సిపల్ చైర్మన్ పదవి ఓసీకి కేటాయిస్తారా? బీసీకి రిజర్వ్ అవుతుందా? మహిళకు రిజర్వేషన్ వర్తిస్తుందా? అనే ప్రశ్నలు ప్రధానంగా వినిపిస్తున్నాయి. రిజర్వేషన్ ఖరారైన తర్వాతే అభ్యర్థుల ఎంపికపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**కూటమిలో ఏ పార్టీకి అవకాశం?..** టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున చైర్మన్ అభ్యర్థిని ఏ పార్టీ నుంచి ఎంపిక చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. కూటమి పార్టీల మధ్య సమన్వయం, స్థానిక నాయకుల అభిప్రాయాలు, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి.

**వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎవరు?..** మరోవైపు వైఎస్సార్‌సీపీ తరఫున చైర్మన్ అభ్యర్థిగా ఎవరిని బరిలోకి దింపుతారన్న చర్చ కూడా కొనసాగుతోంది. పార్టీ నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? సామాజిక సమీకరణాలు, స్థానిక నాయకుల అభిప్రాయాలకు ఎంత ప్రాధాన్యం లభిస్తుంది? అనేది వేచి చూడాలి.

**మహిళకు రిజర్వేషన్ వస్తే పరిస్థితి ఏమిటి?..** చైర్మన్ పదవి మహిళకు రిజర్వ్ అయితే కూటమి నుంచి ఎవరు అభ్యర్థిగా నిలుస్తారు? వైఎస్సార్‌సీపీ ఎవరికి అవకాశం కల్పిస్తుంది? మహిళా నాయకుల్లో ఎవరెవరి పేర్లు తెరపైకి వస్తాయి? అనే అంశాలపై రాజకీయ వర్గాల్లో చర్చకు అవకాశం ఉంది.

**వార్డుల రిజర్వేషన్లే కీలకం!..** జగ్గయ్యపేట మున్సిపాలిటీలోని వార్డుల వారీగా రిజర్వేషన్లు ఖరారైతే అభ్యర్థుల ఎంపికలో కీలక మార్పులు చోటుచేసుకోవచ్చు. ఏ వార్డు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ లేదా ఇతర కేటగిరీలకు కేటాయిస్తారనే దానిపై ఆశావహులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**రెబల్స్ బరిలోకి దిగితే?..** టికెట్లు ఆశించి భంగపడిన నాయకులు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగితే ఆయా వార్డుల్లో పోటీ స్వరూపం మారవచ్చు. ఒకే పార్టీకి చెందిన ఆశావహులు వేర్వేరుగా పోటీ చేయడం, స్థానికంగా వ్యక్తిగత పరిచయాలు, ప్రజా సమస్యలు, అభ్యర్థుల ప్రచారం వంటి అంశాలు ఓటర్ల నిర్ణయంపై ప్రభావం చూపవచ్చు. అయితే రెబల్స్ ప్రభావం ఏ స్థాయిలో ఉంటుందనేది అభ్యర్థుల ప్రకటన తర్వాతే అంచనా వేయగలం.

**ప్రజల్లో ఆసక్తి.. రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ!..** చైర్మన్ రిజర్వేషన్ నుంచి వార్డుల కేటాయింపుల వరకు, కూటమి అభ్యర్థుల ఎంపిక నుంచి వైఎస్సార్‌సీపీ వ్యూహాల వరకు అనేక ప్రశ్నలు జగ్గయ్యపేట రాజకీయాల్లో చర్చనీయాంశాలుగా మారుతున్నాయి. అధికారిక రిజర్వేషన్లు, ఎన్నికల షెడ్యూల్, అభ్యర్థుల ప్రకటన వెలువడిన తర్వాతే రాజకీయ సమీకరణాలపై మరింత స్పష్టత రానుంది. జగ్గయ్యపేట చైర్మన్ పీఠం ఎవరికి దక్కుతుంది? ఏ పార్టీ ఏ వ్యూహంతో ముందుకు సాగుతుంది? రెబల్స్ ప్రభావం ఎలా ఉండనుంది? అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది.

# ZPHS పోలంపల్లిలో ఘనంగా ఖో-ఖో శిక్షణ శిబిరం ముగింపు

**● విద్యార్థులకు టీ-షర్ట్స్ బహూకరించిన టీడీపీ మండల ఉపాధ్యక్షుడు దారెల్లి చిరంజీవి**





**వత్సవాయి,అక్టోబర్ 10 (వార్తాప్రభ) :** మండల పరిధిలోని పోలంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో గత 12 రోజులుగా నిర్వహించిన ఖో-ఖో క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు వత్సవాయి మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు దారెల్లి చిరంజీవి టీ-షర్ట్సును బహూకరించారు. విద్యార్థుల క్రీడా ప్రతిభను ప్రోత్సహించిన ఆయనకు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని, పాఠశాలతో పాటు వత్సవాయి మండలానికి మంచి పేరు తీసుకురావాలని కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు ఆకాంక్షించారు.

**పాల్గొన్న ప్రముఖులు..** నందిగామ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఉప్పులూరి గురునాథం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కొక్కిలిగడ్డ జ్యోతి, స్కూల్ కమిటీ చైర్మన్ వడ్డెపూడి అప్పారావు, వైస్ చైర్మన్ దారెల్లి తిరుపతమ్మ, సీపీఎం సీనియర్ నాయకుడు మండేపూడి చంద్రశేఖర్, సొసైటీ చైర్మన్ మన్నెం బాలకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకుడు మన్నెం భాస్కర్ రావు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు దారెల్లి చిరంజీవి, మాజీ ఎంపీటీసీ ఆవుల రామారావు, పాఠశాల కమిటీ సభ్యులు కాకాని గురవయ్య, కూచిపూడి దావీదు, ఆవుల తిరుపతమ్మ, గ్రామ పెద్ద వంకాయలపాటి శ్రీను, వ్యాయామ ఉపాధ్యాయుడు ధనాల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188

## శ్రీరామ్ నగర్ కాలనీ సమస్యలపై మాజీ మేయర్ జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతగాని కోటేష్ గౌడ్ ను కలిసిన కాలనీవాసులు.



**జవహర్ నగర్, అక్టోబర్ 10(వార్తా ప్రభ):** కీసర సర్కిల్జవహర్ నగర్శ్రీరామ్ నగర్ కాలనీ సమస్యలపై మాజీ మేయర్ జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ ని కలిసిన కాలనీ మహిళలుజవహర్ నగర్‌లోని శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన స్థానిక నివాసితులు తమ కాలనీలో నెలకొన్న పలు సమస్యలను మాజీ మేయర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ కి వివరించేందుకు వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చి, వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారు శ్రద్ధగా విని, సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా శాంతి కోటేష్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిగంటి సుధా రాణి, మరోజు అరుణ, పల్లె లావణ్య, మంత్రి కవిత, దాసరి పద్మ, బలమాయి జ్యోతి, టి. దుర్గాబాయి, రజిత, పి. సత్యమ్మ, జె. స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండగ

**పీఏసీ ఛైర్మన్ అరెక పూడి గాంధీ**





**శేరిలింగంపల్లి, అక్టోబర్ 10 (వార్తాప్రభ):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. చందానగర్ పీజేఆర్ స్టేడియంలో రాగం సుజాత నాగేందర్ యాదవ్ ఫౌండేషన్, శేరిలింగంపల్లి మండల గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం సంయుక్తంగా నిర్వహించిన మెగా బతుకమ్మ సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆడపడుచులకు ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ మహిళల ఔన్నత్యానికి, తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని గాంధీ పేర్కొన్నారు. మాజీ సాంఘిక సంక్షేమ బోర్డు ఛైర్‌పర్సన్ రాగం సుజాత యాదవ్ జయంతిని పురస్కరించుకుని ఈ వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే, మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ త్రిపురనేని వెంకటరత్నం, మాజీ కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, జగదీశ్వర్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు రఘునాథ్‌రెడ్డి, మహిళలు, విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రీడలతోనే ఆరోగ్యం, ఉత్సాహం: వడ్త్యా రమేష్

**దేవరకొండ అక్టోబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** క్రీడలు ఆరోగ్యవంతమైన జీవితానికి ఎంతగానో దోహదపడతాయని బిఆర్ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్యా రమేష్ పేర్కొన్నారు. దసరా పండుగ సందర్భంగా పీఏపల్లి మండలం అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దేవరకొండ డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ప్రశాంతతను అందిస్తాయని తెలిపారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాకారులు స్నేహభావంతో ఆడాలని సూచించారు. పోటీల విజేతలకు వడ్త్యా రమేష్, వంగాల కృష్ణా రెడ్డి, సర్పంచ్ రమావత్ చిరంజీవి, రామావత్ రన్య నాయక్ జ్ఞాపకార్థం బహుమతులు అందజేస్తున్నట్లు ఆర్గనైజర్లు రాజ్యా నాయక్, సత్యనారాయణ చారి, ప్రశాంత్, సంజీవ తెలిపారు.





కీసర సర్కిల్ జవహర్ నగర్ డివిజన్ జ్యోతి కాలనీలో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించి అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మరియు శాంతి కోటేష్ గౌడ్, జవహర్ నగర్ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, గజ్వేల్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.
**జవహర్ నగర్, అక్టోబర్ 10(వార్తా ప్రభ)**

# గరీబ్‌పేటలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్!

● 87 వాహనాలపై జరిమానాలు.. 30 మద్యం సీసాలు స్వాధీనం ● మాదకద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం ● డీఎస్పీ ఆదినారాయణ





**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు సుజాతనగర్ మండల పరిధిలోని గరీబ్‌పేట గ్రామంలో శనివారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో ఉదయం 4 గంటల నుంచి 7 గంటల వరకు నిర్వహించిన ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 68 ద్విచక్ర వాహనాలు, 19 త్రిచక్ర వాహనాలను గుర్తించారు. మొత్తం 87 వాహనాలపై చట్టప్రకారం జరిమానాలు విధించడంతో పాటు 30 ఐఎంఎఫ్ఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

**మాదకద్రవ్యాలపై అవగాహన** ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడిన డీఎస్పీ ఆదినారాయణ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. కోడిపందాలు, పేకాట, జూదం, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి** ఓటీపీ, యూపీఐ మోసాలు, నకిలీ ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఇటీవల నమోదైన కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి, తిరిగి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి** ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని డీఎస్పీ కోరారు. గ్రామంలో మతసామరస్యాన్ని కాపాడుతూ ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించాలని సూచించారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో సీఐలు యాసీన్, వెంకటేశ్వర్లు, ఇంద్రసేనారెడ్డి, జితేందర్, శ్రీలక్ష్మితో పాటు ఇతర పోలీసు అధికారులు, సుమారు 120 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జంతర్ మంతర్ నిరసన కారులపై లాఠీచార్జి, అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

**-సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి.**



**జవహర్ నగర్, అక్టోబర్ 10(వార్తా ప్రభ)** సిఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మరియు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో విద్యార్థి, యువత, వామపక్ష, సిజెపి సంస్థల ఆధ్వర్యంలో జరిగిన నిరసన కారులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పారా మిలిటరీ, పోలీసు బలగాలు జరిపిన లాఠీచార్జి, అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం, అమానుషం అని సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి తీవ్రంగా ఖండించారు. 2026, అక్టోబర్-10, శనివారం రోజు ఎస్ఐఆర్ ను రద్దుచేయాలని, 13 కోట్ల ఓట్లను తొలగించడాన్ని, అందులోను ముఖ్యంగా ఆదివాసి, దళిత, క్రిష్టియన్, ముస్లీం ఇతర మైనారిటీ వర్గాల ప్రజల ఓట్లను తొలగించడాన్ని తీవ్రంగా నిరసిస్తూ శాంతియుతంగా నిరసన తెలుపబానికి ఢిల్లీకి చేరుకుంటున్న మహిళ, విద్యార్థి, యువత పట్ల కేంద్రంలోని బీజేపీ మనువాద నరేంద్రమోదీ ప్రభుత్వ పోలీసులు అనుసరించిన వైఖరి రాజ్యాంగ బద్ధమైన ఆర్టికల్ 19కి వ్యతిరేకం అని మండిపడ్డారు. ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, మణిపూర్, గోవా రాష్ట్రాలలో ప్రభుత్వ అసెంబ్లీ పాలన గడువు 2027, మార్చినెల నాటికి పూర్తి కావస్తున్నదని, ఏప్రిల్ నాటికి తిరిగి ఎన్నికలు జరుగోబోతున్న క్రమంలో ఓట్ చోరీ ప్రభావం, పై ఐదు రాష్ట్రాలలో కూడ ఉండవచ్చు అనేది విపక్షాల ఆందోళన న్యాయమైనదని అన్నారు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలో అస్సాం, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి ఎన్నికల ఫలితాలు విపక్షాలకు పెద్ద గుణపాఠాలు అందించాయని పేర్కొన్నారు. రాజ్యాంగ బద్ధంగా నడుచుకోవాల్సిన పాలకులు, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, ప్రజాస్వామిక వ్యవస్థలను ధ్వంసం చేయడం దుర్మార్గమని అన్నారు. వారి రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ప్రశ్నించి, పోరాడే శక్తులను మ్యాగీ నక్సలైట్లు, తీవ్రవాదులు, పాకిస్థాన్ ఏజెంట్లు, తుకుడే తుకుడే గ్యాంగులుగా చిత్రికరించి, వారిపై పెద్ద ఎత్తున పౌరరక్షణ దళాల పేరిట ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్ లాంటి మతోన్మాద ప్రవేట్ అల్లరిమూకలచే బెదిరింపులు, హింసాత్మక చర్యలకు పాల్పడేలా కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహించడాన్ని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలని కోరారు. ఎన్నికల వ్యవస్థ యొక్క స్వతంత్రతను దెబ్బతీసిన జ్ఞానేష్ కుమార్ చేత రాజీనామా చేయించి, ఎస్ఐఆర్ ను రద్దుచేయాలని బీజేపీ నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని షేక్ షావలి శనివారం రోజు పంపిన పత్రిక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# సుజాతనగర్ అభివృద్ధికి కూనంనేని ప్రత్యేక చొరవ!

**రూ.8.75 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్.. రూ.5 కోట్లతో సింగభూపాలెం చెరువు అభివృద్ధి రూ.500 కోట్లతో కొత్తగూడెం రింగ్ రోడ్డు.. 18 ఎకరాల్లో స్టేడియం ఏర్పాటుకు కృషి**



**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్‌తో పాటు కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. సుజాతనగర్ 22వ డివిజన్‌ల నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. విద్య, సాగునీరు, రహదారులు, క్రీడలు, మహిళల ఉపాధికి ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. సుజాతనగర్ కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు రూ. 8.75 కోట్లు, సింగభూపాలెం చెరువు కట్ట అభివృద్ధికి రూ. 5 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. సీతారామ సాగర్ కాలువ ద్వారా చెరువుకు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్తగూడెం పట్టణ అభివృద్ధికి రూ. 500 కోట్లతో రింగ్ రోడ్డు మంజూరైందని, బృందావనం సమీపంలో 18 ఎకరాల్లో స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. విమానాశ్రయం ఏర్పాటుపైనా అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు సుజాతనగర్‌లో కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సుజాతనగర్ కార్పొరేషన్ పరిధిలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందిస్తామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా మేయర్ ముదు గణేష్ టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు మార్కెట్ కమిటీ చైర్మన్ లాల్ సింగ్ సీపీఐ మండల కార్యదర్శి కోమరి హనుమంతరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దసరు, జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల రాములు, తాలూరి పాపారావు, సహాయ కార్యదర్శి తాలూరి ధర్మారావు, గోపి వీర్ల మల్లేష్, బొడ్డు కేశవరావు, సీతంపేట సర్పంచ్ గరిక ఉపేందర్, బండి రమేష్, భూక్యా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు దుర్మార్గం.

**సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి.**
**ఢిల్లీ లాఠీ చార్జికి నిరసనగా తొర్రూరులో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నిరసన.**




**తొర్రూరు అక్టోబర్ 10 (వార్తప్రభ):** అక్రమ పద్ధతుల్లో 13 కోట్ల భారతీయుల ఓట్లను తొలగించిన సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను రాజీనామా చేయించాలని ప్రజాస్వామ్య పద్ధతిలో ఢిల్లీలో నిరసన చేస్తున్న వారిపై మోడీ ప్రభుత్వ తీరు దుర్మార్గమని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి, తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముజంపల్లి వీరన్న లు అన్నారు. ఢిల్లీ లాఠీ చార్జి కి నిరసనగా శనివారం తొర్రూరులోని గాంధీ విగ్రహం వద్ద మాస్ లైన్ ఆధ్వర్యంలో నల్లగుడ్డతో రోడ్డుపై నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ఉద్దేశపూర్వకంగా కాలరాస్తున్న మోడీ ప్రభుత్వం ఫాసిస్ట్ హిట్లర్ బాటలో నడుస్తుందని అన్నారు. విద్యార్థులు, యువకులు, మేధావులు చివరికి సుప్రీంకోర్టు లాయర్స్ ను సైతం అరెస్టు చేయటం అన్యాయమన్నారు. శత్రు దేశాలతో పోరాడటానికి దేశ సరిహద్దుల్లో ఉండాల్సిన కేంద్ర బలగాలు ఢిల్లీ జంతర్ మంతర్ చుట్టూ కేంద్రీకరించటం భారత ప్రజాస్వామ్యానికి చీకటి రోజు అని అన్నారు. అర్హులైన భారతీయ ఓట్లను తొలగించిన జ్ఞానేష్ కుమార్ ను దేశద్రోహిగా ప్రజలంతా నిరసిస్తుంటే మోడీ ప్రభుత్వం దొంగ నిద్రను నటిస్తుందని అన్నారు. ప్రపంచానికి స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం గురించి చెప్పే విశ్వ గురువు మోడీ తను అమలు చేస్తున్న ఈ నిర్బంధం సంగతేమిటని ప్రశ్నించారు. తొలగించిన ఓట్లను పునరుద్ధరించి ఢిల్లీ నగర వీధులలో విధించిన ఆంక్షలు తొలగించి రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో జరుగుతున్న నిరసనను ఉద్రిక్తతలను పెంచి నిర్బంధాన్ని అమలు చేయాలని చూస్తే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఇప్పటికే దేశంలో వివిధ ప్రాంతాలలో 50వేల మందిని అక్రమంగా అరెస్టు చేశారని వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా నాయకులు శ్రీరాం పుల్లయ్య మల్లికంటి వెంకన్న గుండాల సోమ నరసయ్య, మంగళపల్లి వెంకటకృష్ణ, యాకన్న కందగట్ల వెంకన్న, రాము, ఎడ్ల ధర్మయ్య, శ్రీకాంత్, సంపత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్

## గొల్లగూడెం పాఠశాలకు దారి కల్పించాలి!

**గ్రామస్థుల వినతిపై ఎమ్మెల్యే కూనంనేని స్పందన సంబంధిత అధికారులకు ఆదేశాలు**



**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్: గొల్లగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు సరైన దారి కల్పించాలని కోరుతూ గ్రామస్తులు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించగా ఎమ్మెల్యే స్పందించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల రాములు, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి పాఠశాలకు దారి లేక చిన్నారులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుని పాఠశాలకు దారి కల్పించాలని కోరారు. గ్రామస్తుల వినతిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో సమస్య పరిష్కారంపై గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా గున్న సంధ్య





**జవహర్ నగర్, అక్టోబర్ 10(వార్తా ప్రభ)** భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గున్న సంధ్య కి భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి నిర్వాహకులు మహంకాళి భిక్షు రాష్ట్ర కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. మూలాలను మర్చిపోకూడదు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గనక లేకుంటే మనం ఇంకా ఈ బానిసలుగానే మిగిలి ఉండేవాళ్లం బానిస సంకెళ్లు తెంచి మన బతుకులను మల్లెపువ్వు లాగా తీర్చిదిద్దినటువంటి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానం బోధించు సమీకరించు పోరాడు నిన్ను నువ్వు విశ్వసించు, వ్యక్తులను వక్రీకరించినంత మాత్రాన, చరిత్రను ఎవరు వక్రీకరించలేరు అనేది నిజం. అందుకు చదువు సంపద సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ కలలు కన్నా కుల రహిత సమాజం కోసం, మా మహిళల అభ్యున్నతి కై హిందూ కోడ్ బిల్లు కోసం, అంబేద్కర్ ఆనాడే తన న్యాయశాఖ పదవికి రాజీనామా చేసిన త్యాగమూర్తి, రాజ్యాంగ నిర్మాత పితామహుడు అంబేద్కర్ అందరివాడు కొందరివాడు కాదు, కులాలకు మతాలకు పార్టీలకు అతీతంగా, అంబేద్కర్ ని ఆరాధించవలసిన అవసరం ఎంతైనా ఉంది అని భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు గున్న సంధ్య అన్నారు. ఎందుకంటే అతడే గనక లేకుంటే ఈరోజు వర్ణ వ్యవస్థలో, ఇంకా కులవృత్తులపై ఆధారపడి ఉండేవాళ్లం ఇంతటి స్వేచ్ఛ సమానత్వం అక్కలు బావ ప్రకటన స్వేచ్ఛ ప్రాథమిక హక్కులు మనకు దక్కేవి కాదు అని అన్నారు. అందుకు జనాన్ని చైతన్యపరచుటకు మహంకాళి బిక్షు చేస్తున్నటువంటి జ్ఞానమాల కార్యక్రమాలను చూసి నేను కూడా నా వంతు కర్తవ్యం గా అంబేద్కర్ ఐడియాలజీ కోసం పనిచేస్తానని నా ఇష్టానుసారంగా ముందుకు రావడం జరిగింది, ఈ కార్యక్రమంలో మంద ఆనంద్, అబ్బగోని నాగరాజు, మేద స్వామి గడిపే సునీల్ గడ్డం గిరి, జడల కిట్టు నవీన్ సాలమ్మా తదితరులు పాల్గొన్నారు.

## తొర్రూరులో అంబరాన్నంటిన ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు.



**తొర్రూరు అక్టోబర్ 10 (వార్తాప్రభ):** తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే బతుకమ్మ సంబరాలు మండలంతో పాటు తొర్రూరు పట్టణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఎంగిలి పూల బతుకమ్మ సందర్భంగా మహిళలంతా ఒక్కచోట చేరి ఆడిపాడుతూ సంబరాలు చేసుకున్నారు. ఆయా ప్రాంతాల చెరువుల పరిసరాల్లో అందమైన బతుకమ్మలు కనివిందు చేశాయి. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి పడతులు పులకించిపోయారు. మహిళలు తీరొక్క పూలతో భక్తిశ్రద్ధలతో బతుకమ్మను పేర్చారు. బతుకమ్మ వేడుకలతో తొర్రూరు పెద్ద చెరువు పరిసరాలు వెలుగులీనాయి. వందలాది మంది మహిళలు 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ ఆడిపాడారు. మహిళలంతా సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ ఆడారు. మాజీ కౌన్సిలర్ దొంగరి రేవతి శంకర్, లయన్స్ క్లబ్ ప్రతినిధి శారద, మహిళలు బతుకమ్మలతో చెరువు వద్దకు వెళ్లారు.